జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

నిజామాబాద్ | బుధవారం 15 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 157 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం విశేషం: ఆషాఢ స్నానారంభం, వారాహి నవరాత్రారంభం సూర్యోదయం: 5:34 । సూర్యాస్తమయం: 6:32 , చంద్రోదయం: 6:13 । చంద్రాస్తమయం: 7:35 తిథి: శుద్ధ పాడ్యమి మ. 1:48 వరకు, తదుపరి విదియ నక్షత్రం: పుష్యమి రా. 12:50 వరకు, తదుపరి ఆశ్లేష, యోగం: వజ్రం ఉ. 11:07 వరకు, తదుపరి సిద్ధి కరణం: బవ మ. 1:48 వరకు, తదుపరి బాలవ రా. 12:46 వరకు, తదుపరి కౌలవ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# మహిళా సంఘాల్లో లేని ప్రతి అర్హత మహిళను సంఘాల్లో చేర్పించాలి

## జూలై 31లోగా ప్రత్యేక చేర్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఆదేశం




**కామారెడ్డి, ప్రతినిధి జూలై 14 (ప్రజా జ్యోతి):**
జిల్లాలో మహిళా సంఘాల్లో చేరకుండా మిగిలిపోయిన ప్రతి అర్హ మహిళను స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీ) చేర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), సెర్ప్ (సే ర్ పూ) శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (సీసీలు) పాల్గొన్న సమీక్ష సమావేశం మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సెర్ప్ సీఈఓ జూలై నెలను లి"ప్రత్యేక మహిళా సంఘాల చేర్పు మాసం"లిగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో సంఘాల్లో సభ్యత్వం లేని ప్రతి పేద మహిళను గుర్తించి మహిళా సంఘాల్లో చేర్పించడం ఏపీఎంలు, సీసీల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. మహిళా సంఘాల్లో చేరడం ద్వారా పేద మహిళలకు ఆర్థిక స్వావలంబన కలుగుతుందని, జీవనోపాధి కోసం అవసరమైన రుణాలు పొందడంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు, వడ్డీ లేని రుణాలు (వీఎల్ఆర్) వంటి సదుపాయాలను - మిగతా2లో

### రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి గ్రామంలో

# విద్యార్థులు సైన్స్‌పై పరిశోధనా దృక్పథం పెంపొందించుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి జూలై 14 ప్రజా జ్యోతి**
విద్యార్థులు సైన్స్‌పై అవగాహనతో పాటు పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన మంగళవారం రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో పర్యటించిన కలెక్టర్, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు: గ్రామానికి మంజూరైన 25 ఇందిరమ్మ ఇండ్లలో 10 ఇళ్ల నిర్మాణం పూర్తై లబ్ధిదారులు గృహప్రవేశం చేశారు. మిగిలిన 15 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు. నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ: సుమారు 80% పని పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేస్తామని మండల తహసీల్దార్ ఉమామలత తెలిపారు.

**పాఠశాల తనిఖీ -- శాస్త్రీయ దృక్పథం ప్రోత్సాహం**
గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన బోధనపై ఉపాధ్యాయులను అభినందించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్: పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. పక్షుల పరిశీలన: పాఠశాల పరిసరాలకు వచ్చే పక్షుల రాకపోకలు, వాటి ప్రవర్తన, సంఖ్య, జీవన విధానంపై విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో 20 రోజులపాటు పరిశీలన నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఇలాంటి పరిశోధనాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, పరిశీలనా నైపుణ్యం పెంపొందుతుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 41 అటల్ టింకరింగ్ - మిగతా2లో



# కుర్ల ఇసుక క్వారీలోకి అన్ని గ్రామాల ట్రాక్టర్లకు అవకాశం కల్పించండి

## డోంగ్లి తహసిల్దార్ కు మండల సర్పంచులు వినతి

# రాజ్యాంగమే మా మేనిఫెస్టో

### బాన్సువాడ అసెంబ్లీ బీఎస్పీ అధ్యక్షుడిగా అక్కంగారి జగన్ నియామకం

### జిల్లా బీఎస్పీ అధ్యక్షులు హరిలాల్ నాయక్



**బిచ్కుంద జూలై 14(ప్రజాజ్యోతి )**
బాన్సువాడ కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ బాన్సువాడ అసెంబ్లీ అధ్యక్షుడిగా బీసి సామాజిక వర్గానికి చెందిన అక్కంగారి జగన్‌ను జిల్లా అధ్యక్షులుగా మాలోత్ హరిలాల్ నాయక్ నియమించారు. ఆయనకు పార్టీ కండువా కప్పి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మాలోత్ హరిలాల్ నాయక్ మాట్లాడుతూ.. బీఎస్పీ ఎవరి జనాభా ఎంత ఉందో వారికి అంత వాటా కల్పించే పార్టీ అని తెలిపారు. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తామన్నారు. భారత రాజ్యాంగమే మేనిఫెస్టోగా, మహనీయుల ఆశయాలను అమలు చేసే పార్టీ అని పేర్కొన్నారు. యువత, మహిళలు, మేధావులు పార్టీలో చేరి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ అసెంబ్లీ ఇంచార్జ్ జైపాల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు నమోదు కోసం

# ఊరికి వచ్చి...




### యువకుడి విషాదాంతం

### నర్సింగ్‌రావుపల్లిలో విషాదం..ఉరివేసుకుని అంజయ్య మృతి

### బీదర్ నుంచి ఓటరు నమోదు కోసం స్వగ్రామానికి రాగా చోటుచేసుకున్న దుర్ఘటన

### -- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**కామారెడ్డి ప్రతినిధి జూలై 14 (ప్రజా జ్యోతి):**
కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి స్వగ్రామానికి వచ్చిన యువకుడు మంగలి అంజయ్య ఉరివేసుకుని మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం, - మిగతా3లో



# పనులు వేగవంతం త్వరలో సబ్ప్టేషన్ ప్రారంభోత్సవం



**బాల్కొండ ఆర్సి ప్రజా జ్యోతి జులై 14** నిజామాబాద్ జిల్లా భీమ్గల్ మండలంలో రాత్రి నగర్ గ్రామంలో పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ చౌరవతో రహత్ నగర్ గ్రామంలో చురుగ్గా నూతన సబ్ స్టేషన్ పనులు జరుగుచున్నాయి, అందులో భాగంగా ఈరోజు పవర్ ట్రాన్స్ఫార్మర్ పీటింగ్ చేయడం జరిగింది. త్వరలో సబ్ప్టేషన్ ప్రారంభోత్సవం ఉంటుంది. ఈ కార్యక్రమంలో తోట రాజశేఖర్ కన్స్ట్రక్షన్ ఏ డి ఈ , శ్రావణ్ కుమార్ కన్స్ట్రక్షన్ ఏఈ , సాయిలు ఏఈ ట్రాన్స్ఫార్మర్, మోహన్ లైన్మెన్ మరియు స్థానిక సర్పంచి లకావత్ తిరుపతి, ఉప సర్పంచ్ భుక్య సేవలాల్, విడిసి బాదావత్ గోపాల్, రాములు, గ్రామ పెద్దలు బాధావత్ బాలు, శర్మ నాయక్,మోహన్ నాయక్, రాములు, రమేష్ కాంట్రాక్టర్ సతీష్ రావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేలావత్ రాజ్ కుమార్ (లండన్). బర్త్ డే కానుకగా నెలకు సరిపడా నిత్యవసర సరుకుల పంపిణీ.




**బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి జూలై 14** నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం గోనుగొప్పుల తండావాసి (ప్రస్తుతం లండన్ లో ఉద్యోగం) అయినా కేలావత్ రాజకుమార్ తన పుట్టినరోజున పలు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యవసరుకులు పంపిణీ చేసి, తన పుట్టినరోజును అందరిలా ఆడంబరాలు, హంగులు, విందులు, వినోదాలు లేకుండా వినూత్న రీతిలో జరుపుకొని యువతకు ఆదర్శంగా నిలిచాడు. పలు గ్రామాల్లో పేదవారికి, ఇటీవల లింబాద్రిగుట్ట కాలనీకి చెందిన చిన్నారులు నీటి గుంటలో పడి చనిపోయిన కుటుంబాలకు కూడా నిత్యవసర వస్తువులు అందించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో రాజకుమార్ స్నేహితులు ధైడి.సురేష్, ఖలీమ్, అతిక్, నవీద్ భాయ్, జుబేర్లు,లు పాల్గొని తమ వంతు కృషి చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి కొరత...

**బిఇందల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దుస్థితి**

**ఇందల్వాయి జూలై 14 ( ప్రజా జ్యోతి)** ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నీటి కొరత తీవ్రంగా ఉండడంతో పాటు గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ వాళ్లకు చెందిన మినీ వాటర్ ట్యాంక్ దగ్గర ప్లేట్లను శుభ్రం చేసుకోవడంతో పాటు త్రాగునీటి కోసం క్యూ లైన్ ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.. దీంతో పాఠశాల యజమాన్యంగాని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కానీ ప్రత్యేక చర్యలు తీసుకొని పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థిని విద్యార్థులు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇందల్వాయి గ్రామానికి చెందిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు, పాఠశాలలో త్రాగునీటి సమస్య ఏర్పడితే తక్షణమే పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు, ఈ మేరకు మంగళవారం విద్యార్థులు విద్యార్థులు స్కూల్ బయట ఉన్నటువంటి మినీ వాటర్ ట్యాంక్ వద్ద ప్లేట్లను శుబ్రం చేసుకోవడంతో పాటు త్రాగునీటి కోసం వరసలో నిలిచి ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామ సర్పంచ్ ప్రత్యేక చర్యలు తీసుకొని పాఠశాలలు తాగునీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు

# కస్తూర్బా గాంధీ పాఠాశాలను సందర్శించిన ఎంఈఓ.




**రెంజల్, జులై 14(ప్రజాజ్యోతి ):** రెంజల్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి కట్ట. ఆంజనేయులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కట్ట. ఆంజనేయులు మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన జూనియర్ కళాశాలలో బైపీసీ గ్రూపులో గల విద్యార్థులకు త్వరితగతిన అడ్మిషన్ లు చేపట్టి సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని సిబ్బంది సూచించారు. పాఠాశాలలో విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠాశాలలో గల వసతి,సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠాశాల ప్రిన్సిపాల్ శ్యామల, ఉపాధ్యాయుల బృందం తదితరులు ఉన్నారు

# క్యాసంపల్లి తండా అంగన్వాడీ కేంద్రంలో ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 14(ప్రజా జ్యోతి):** కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి తండా గ్రామ అంగన్వాడీ కేంద్రంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార లోపాల నివారణ, నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను తగ్గించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ సుకన్య మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు నిర్దేశిత మోతాదులో ఆల్బెండాజోల్ మాత్రలు వేయించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఎదుగుదల కూడా బాగుంటుందని వివరించారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అంగన్వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ జ్యోతి చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, సురక్షితమైన తాగునీరు వినియోగించడం వంటి అలవాట్లతో నులిపురుగుల సమస్యను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఆయమ్మ, గ్రామ ప్రజలు, విద్యార్థులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

**జూలై 15న హైదరాబాద్‌లో జరిగే నిరుద్యోగుల మహాధర్నాకు యువత భారీగా తరలిరావాలి:**

**సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపు**



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 14(ప్రజా జ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న నిరుద్యోగుల మహాధర్నాకు కామారెడ్డి జిల్లా యువత, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో నిరుద్యోగులతో కలిసి మహాధర్నా కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని శాంతియుతంగా పోరాటాలు చేస్తున్న నిరుద్యోగులపై అక్రమ కేసులు నమోదు చేస్తూ ఉద్యమాలను అణచివేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని పదేపదే కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీల భర్తీపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అసత్య ప్రకటనలు, మోసపూరిత హామీలతో యువతను ఎంతకాలం మోసం చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేలాది మంది యువత తమ ఇళ్లు, పొలాలు, స్థలాలు తాకట్టుపెట్టి కోచింగ్‌లు, పోటీ పరీక్షల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, సంవత్సరాల తరబడి గ్రంథాలయాల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం, శ్రమను వెచ్చిస్తున్నారని అన్నారు. అలాంటి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడకుండా ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షలకు పైగా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయడంతో పాటు పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులు, డీఎస్సీ, గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.5,000 నిరుద్యోగ భృతి అందించాలని, వివాదాస్పద జీవోలను ఉపసంహరించి ఎలాంటి కోర్టు వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగుల మహాధర్నాకు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి యువత, నిరుద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు వెంకట్ గౌడ్, మూతిరం కొత్త నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు బుధవారం అరుణ్ కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పెంటఖుర్ద్ గ్రామ సర్పంచ్ వెంకటేష్ తమ గ్రామంలో స్మశాన వాటిక దగ్గర బోర్ వేయించడం జరిగింది..



**ప్రజా జ్యోతి బోధన్ జూలై 14..** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెంటఖుర్ద్ గ్రామంలో గ్రామ సర్పంచ్ వెంకటేష్ గ్రామ సెక్రెటరీ సుభాష్ ఉప సర్పంచ్ వినోద్. 15.ఆర్థిక ఫైనాన్షియల్ కింద స్మశాన వాటిక దగ్గర బోర్ వేయించడం జరిగింది సర్పంచిగా గెలిచిన మొదటి సారీ గ్రామంలో స్మశాన వాటిక దగ్గర బోర్ వేయించడం ప్రజలు చాలా సంతోషిస్తున్నారు గ్రామంలో ఇలాంటి యువ సర్పంచ్ ఉండడం గ్రామస్తుల అదృష్టం. గ్రామ ప్రజలు జగన్ గౌడ్ రాజు జయరాం సాకలి జయరాం కురుమ లక్ష్మణ్ గంగులు. పరుశురాం గంగారాం మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పెంటకూఖుర్ద్ గ్రామ సర్పంచ్ గైని వెంకటేష్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ దగ్గర బోర్ వేయించారు..



**ప్రజా జ్యోతి బోధన్ జులై 14..** నిజామాబాద్ జిల్లా బోధన మండలంలోని పెంటఖుర్ద్ గ్రామంలో గ్రామ సర్పంచ్ గైని వెంకటేష్ ఉప సర్పంచ్ వినోద్ గ్రామ సెక్రెటరీ సుభాష్ వీరి ఆధ్వర్యంలో 15.ఆర్థిక ఫైనాన్షియల్ కింద వచ్చిన నిధులనుండి బోర్ వేయించడం జరిగింది. గ్రామ ప్రజల సహకారంతో గ్రామ సర్పంచ్ వెంకటేష్ మొదటిసారి రెండు చోట్ల బోర్లు వేయించడం జరిగింది రావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు జగన్ గౌడ్ గంగులు లక్ష్మణ్ జయరాం చాకలి జయరాం పరశురాం కురుమ రాజు ఆడకట్ల కర్ర సాయిలు మరియు గ్రామ ప్రజలు తదితరులు అందరూ పాల్గొన్నారు

# పెంటఖుర్ద్ గ్రామంలో సర్ ప్రక్రియ 97.కంప్లీట్ అయింది ఈరోజుకు..




**ప్రజా జ్యోతిబోధన్ జులై 14..** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెంట కుర్ధు గ్రామంలో సర్ ప్రక్రియ కార్యక్రమం 97 పర్సెంట్ కంప్లీట్ అయిందని బి ఎల్ ఓ.జిపి సెక్రెటరీ సుభాష్ చెప్పారు. ఈసర్ ప్రత్యేక కార్యక్రమంలో బి ఎల్ ఓ సురేఖ జిపి సెక్రెటరీ సుభాష్ ఆశ వర్కర్ జ్యోతి ఈ సర్ కార్యక్రమంలో పాల్గొన్నారు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమం చాలా వేగంగా 97% కంప్లీట్ చేశారు

# గన్నారం గ్రామంలో ఎస్సీలపై సామాజిక బహిష్కరణ ఆరోపణలు -- ఎస్సీ కమిషన్ ఆరా



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి )** ఇందల్వాయి, జూలై 14: ఇందల్వాయి మండల కేంద్రంలోని గన్నారం గ్రామంలో గత రెండు నెలలుగా ఎస్సీ వర్గాలపై సామాజిక బహిష్కరణ కొనసాగుతోందని గ్రామానికి చెందిన బాధితులు ఆరోపిస్తున్నారు. గ్రామ వీడీసీ (ఎణజ) తీసుకున్న నిర్ణయాల కారణంగా ఎస్సీ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. బాధితుల కథనం ప్రకారం, ఎస్సీలకు గ్రామంలో పనులు ఇవ్వకుండా అడ్డుకోవడం, పనికి పిలవకపోవడం, నిబంధనలు ఉల్లంఘించారనే పేరుతో జరిమానాలు విధించడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇదే సమయంలో గ్రామంలోని అంబేద్కర్ సంఘం ఏర్పాటు చేసిన బోర్డును ఎమ్మార్వో సమక్షంలో వీడీసీ తొలగించిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనపై గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నేడు ఎస్సీ కమిషన్ అధికారులు ఘటనపై ఆరా తీసి, బాధితులు, స్థానిక అధికారులు మరియు సంబంధిత వర్గాల నుంచి వివరాలు సేకరించినట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు, దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కుర్ల ఇసుక క్వారీలోకి అన్ని గ్రామాల ట్రాక్టర్లకు అవకాశం కల్పించండి

బిచ్కుంద జులై 14 (ప్రజాజ్యోతి )

మద్నూర్, డోంగ్లి మండలాల పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇసుక సరఫరాలో కుర్లా గ్రామస్తులు అజమయిషీ చెలాయిస్తున్నారని అన్ని గ్రామాల సర్పంచులు అన్నారు. ఇంతకు ముందు ఇసుక క్వారీలోకి అన్ని గ్రామాల ట్రాక్టర్లకు అనుమతులు లభించేవని తెలిపారు. తాజాగా మంగళవారం డోంగ్లీ మండల సర్పంచులు సంయుక్తంగా తహశీల్దార్ రంజిత్ కుమార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు కృషితో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఇబ్బందులు కలగకుండా డోంగ్లి మండలంలోని కుర్లా గ్రామ శివారు ప్రాంతంలోని మంజీరా నది నుండి ఇసుకను తరలించడానికి ప్రభుత్వం ద్వారా ప్రత్యేకంగా ఇసుక క్వారీ ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కుర్లా గ్రామాస్తులు మాత్రమే మంజీరా నది నుంచి ఇసుకను తీసుకుంటామని అంటున్నారని, ఇది ఎంత వరకు సబబు అని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే ఊరు ట్రాక్లర్లను ఇసుక క్వారీలోకి రాకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. మండల పరిధిలో నిర్మిస్తున్న ఇందరమ్మ ఇండ్లు సకాలంలో




పూర్తి కావాలంటే ఇసుక క్వారీలోకి అన్ని గ్రామాల ట్రాక్లర్లను అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యూనుస్ పటేల్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బాచవార్ లక్ష్మణ్, మండలంలోని సర్పంచులు హాలే బస్వంత్, సంగ్రామ్ పటేల్, శ్రీధర్, శ్రీకాంత్, దత్తు, నాయకులు విలాస్, శివారెడ్డి, పలువురు ట్రాక్టర్ యజమానులు ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీలో మండుతున్న ఎండలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఎండాకాలాన్ని గుర్తు చేస్తోంది. వాస్తవానికి జులై నెలలో వర్షాలు పడాల్సిందిపోయి.. వేడిగాలులు, ఎండల తీవ్రత కనిపిస్తోంది. గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వేడగాలుల తీవ్రత పెరిగింది. ముఖ్యంగా రాయలసీమలోని ప్రాంతాల్లో వేసవి మాదిరిగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం కోస్తా జిల్లాలు, రాయలసీమ ప్రాంతాల్లో భానుడు ప్రతాపం చూపించాడు. పగటిపూట ఉష్ణోగ్రతలు సాధరణం కన్నా నాలుగు నుంచి ఏడు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. బాపట్లలో ఏకంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లా జంగమేశ్వరపురం, తిరుపతిలో 41 డిగ్రీలు.. ఒంగోలులు 40.5 డిగ్రీలు, నంద్యాలలో 40.2, నెల్లూరులో 40.1 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో వారం రోజులు వర్షాలు పడవని.. ఎల్‌నినో కారణంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయని చెబుతోంది వాతావరణశాఖ. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణ, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వేడిగాలులు వీచాయి. కోస్తాలోని మిగిలిన జిల్లాలు, రాయలసీమ జిల్లా?లో వేడి వాతావరణం కొనసాగింది. ఈ నెల మొదటి వారం అక్కడక్కడా వర్షాలు పడినా.. ఆ తర్వాత మళ్లీ వాతావరణం మారిపోయింది. మళ్లీ ఎండలు, వేడిగాలుల ప్రభావం పెరిగింది. ఈ వేడిగాలులు మరికొన్ని రోజులు కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు. ఈనెల మూడో వారంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ఈ అల్పపీడనం ఏర్పడినా ఉత్తరాంధ్ర జిల్లాలలో మాత్రమే వర్షాలు పడతాయంటున్నారు. మిగిలిన జిల్లాల్లో వర్షాభావం కొనసాగుతుందని.. ఈ నెల 22వ తేదీ తర్వాత రుతుపవనాలు పుంజుకుంటే వానలు పడే అవకాశం ఉందంటున్నారు.రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఏకంగా 25 శాతం లోటు వర్షపాతం ఉందని చెబుతున్నారు. అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని.. ఇది ఖరీఫ్ పంటలపై ప్రభావం చూపుతుందంటున్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్ని గమనిస్తే.. ఈ నెల 22వ తేదీ వరకు రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాల్లో ఎండ తీవ్రత, వర్షాభావం కొనసాగుతాయని భావిస్తున్నారు. మొత్తం మీద రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది.. వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.



### చేపలపై తీవ్ర ప్రభావం

ఎల్ నినో ప్రభావంతో దాదాపు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.. చాలా ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి.. వర్షాలు ఆశించినంతంగా కురవకపోవడం వల్ల పంటల దిగుబడి తగ్గడంతోపాటు.. ఆహారం కొరత ఏర్పడే అవకాశం ఉంది.. దీంతోపాటు ఎల్ నీనో అనేక విషయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఎల్ నీనో పరిస్థితుల వల్ల చేపల లభ్యత కూడా తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా సముద్రంలో లభించే సార్డిన్‌ల లభ్యత తగ్గుతుందన్న వార్తలు ఆందోళనలను రేకెత్తించాయి. సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఈ హెచ్చరికను జారీ చేసింది. సముద్రంలో వడగాలులను సృష్టించే ఎల్ నినో.. బలపడటంతో చేపల లభ్యత తగ్గుతుందని అది హెచ్చరించింది. ఎల్ నినో వల్ల అత్యధికంగా ప్రభావితమయ్యే చేపలలో సార్డిన్ (కవళ్ళు లేదా కవ్వలు) లు కూడా ఒకటిగా ఉంటాయననివేదిక సూచిస్తోంది.సముద్రంలోని తీవ్రమైన వేడి, కేరళ, ఏపీ తీరంలో అత్యధికంగా లభించే ఆయిల్ సార్డిన్ వంటి చిన్న చేపలను ప్రభావితం చేస్తుంది. శాస్త్రవేత్తలు అందించిన నివేదికల ప్రకారం, వేడి వాతావరణంలో సార్డిన్‌లు పునరుత్పత్తి సమస్యలతో బాధపడటం, వాటి గుడ్లు నశించపోవడం లేదా దెబ్బతినడం సర్వసాధారణం. సార్డిన్‌లు సాధారణంగా మే-జూన్ నెలల్లో గుడ్లు పెడతాయి. ఎల్ నినో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతను క్రమంగా పెంచుతున్నందున, సార్డిన్ గుడ్లు పొదిగి లార్వాలుగా మారే ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. దీని ఫలితంగా, గుడ్లు దెబ్బతినడంతోపాటు.. ఒకవేళ ఉత్పత్తి అయిన కవ్వళ్ల పిల్ల చేపలు వేడిని తట్టుకోలేక చనిపోతాయి.దీనికి తోడు, హెర్రింగ్ చేపల ప్రధాన ఆహారమైన సముద్రపు నాచు నాశనమవుతోంది. ఎల్ నినో కారణంగా, సముద్రపు అడుగుభాగం నుండి పోషకాలు అధికంగా ఉన్న నీరు పర్వతంలా పైకి వచ్చే పరిస్థితి బలహీనపడింది. ఈ సహజ ప్రక్రియను అప్‌వెల్లింగ్ అంటారు. దీనితో, సముద్రపు నాచు రాక బాగా తగ్గిపోయింది. హెర్రింగ్ (సముద్రంలో భారీ గుంపులుగా ప్రయాణించే చిన్న, వెండి రంగు చేప) చేపలు తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్నాయి. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ ఆహార కొరత ఏర్పడి, సంతానోత్పత్తికి అనువైన వాతావరణం కనుమరుగవడంతో, హెర్రింగ్‌లతో సహా సార్డినెస్ అలాగే ఇతర చేపలు చల్లని సముద్రాలకు తరలివెళ్లడం ప్రారంభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.ప్రస్తుతం మనం అనుభవిస్తున్న ఎల్ నినో ప్రభావం.. వచ్చే ఏడాది (2027) ఏప్రిల్, మే నెలల నాటికి కనబడతాయని వాతావరణ శాఖ అలాగే.. ఆహార నిపుణులు అంచనా వేస్తున్నారు. కొత్త చేపల ఉత్పత్తి లేకపోవడం వల్ల వచ్చే ఏడాది నాటికి సముద్రంలో తీవ్రమైన చేపల కొరత ఏర్పడే అవకాశం ఉందని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చెబుతోంది.వీటన్నిటితో పాటు, పగడపు దిబ్బల విధ్వంసం వల్ల కలిగే పరిణామాలు కూడా ఉన్నాయి. చెంపల్లి (రెడ్ స్నాపర్) వంటి చేపలు తమ మనుగడ కోసం పగడపు దిబ్బలపై ఆధారపడి ఉంటాయి. లక్షద్వీప్ వంటి ద్వీపసమూహాలలో దీని పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి.. ఎందుకంటే పగడపు దిబ్బల విధ్వంసం భూమి క్షీణతకు కూడా దారితీయవచ్చు.

# ఓవైసీని భయపెడుతున్న స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్

**హైదరాబాద్ :** మునుపెన్నడూ లేని విధంగా సాగుతున్న ఈ ఓటర్ల జాబితా ప్రక్షాళన, దశాబ్దాలుగా పాతబస్తీని తమ రాజకీయ సామ్రాజ్యంగా ఏలుతున్న మజ్లిస్ పార్టీకి, ముఖ్యంగా ఓవైసీ కుటుంబానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. క్షేత్రస్థాయిలో నకిలీ ఓట్లు, అక్రమ ఓట్ల వ్యవహారం ఈ ప్రత్యేక తనిఖీలతో వెలుగులోకి రాబోతుండటమే ఇందుకు ప్రధాన కారణమనే చర్చ జోరందుకుంది.హైదరాబాద్ జిల్లా పరిధిలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా వంటి పాతబస్తీ నియోజకవర్గాల్లో ప్రతి ఎన్నికల్లోనూ అత్యంత తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంటుంది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సగటు ఓటింగ్ 45శాతం నుండి 50శాతం లోపే ఉండటానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితాలోని అడ్డగోలు లోపాలేనని ఈ నిరంతర తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో బూత్ లెవెల్ అధికారులు కేవలం ఆధార్ కార్డ్ లేదా ఏదైనా ఒక సాధారణ గుర్తింపు పత్రాన్ని చూసి ఓట్లు నమోదు చేసేవారు. దీనివల్ల ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి ఓట్లు కూడా జాబితాలో అలాగే ఉండిపోయాయి.ప్రస్తుత కఠినమైన 'స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్'లో అధికారులు పౌరసత్వం, స్థానికతను నిరూపించుకోవడానికి దశాబ్దాల నాటి మున్సిపల్ అసెస్‌మెంట్ రసీదులు, రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ వంటి పక్కా లీగల్ డాక్యుమెంట్లు అడుగుతున్నారు. పాతబస్తీలో తరతరాలుగా నివసిస్తున్న మెజారిటీ ముస్లిం పేద కుటుంబాలు అద్దె ఇళ్లలోనో, సరైన పత్రాలు లేని పాత ఇళ్లలోనో ఉంటుండటంతో ఈ పత్రాలు చూపించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసేసరికి పాతబస్తీలో భారీ సంఖ్యలో బోగస్, బల్క్ ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.ఈ ఓట్ల గల్లంతు భయం వెనుక ఎంఐఎం పార్టీ ఉనికికి సంబంధించిన పెద్ద రాజకీయ సంక్షోభం దాగి ఉంది. పాతబస్తీలో పోలింగ్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ నమోదయ్యే లాయల్ ఓట్ బ్యాంక్, బల్క్ ఓటింగ్ ఆధారంగానే అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలు దశాబ్దాలుగా ఏకపక్ష విజయాలను సాధిస్తూ వస్తున్నారు. ఈ ప్రత్యేక ప్రక్షాళన వల్ల



లక్షలాది ఓట్లు తొలగిపోతే, ఎంఐఎం సంప్రదాయ ఓట్ బ్యాంక్ ఛిన్నాభిన్నమవుతుంది.రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సీట్ల సంఖ్య దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఓటర్ల జాబితాలో నకిలీలు ఏరివేస్తే, ఓవైసీ కుటుంబానికి పాతబస్తీపై ఉన్న తిరుగులేని రాజకీయ పట్టు సడలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.తమ రాజకీయ కోటను కాపాడుకునేందుకు రంగంలోకి దిగిన ఎంఐఎం అగ్రనేత అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి తెరలేపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో, ఎంఐఎం ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ని ఉపయోగించి, కర్ణాటక ప్రభుత్వం సకల సేవల చట్టం-2011 కింద జారీ చేస్తున్నట్లుగా, ఇక్కడి ఓటర్లకు కూడా శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలు లేదా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఓవైసీ డిమాండ్ చేస్తున్నారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న బ్లాక్‌మెయిల్ రాజకీయంగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు.మరోవైపు, సీఎం రేవంత్ రెడ్డి ఈ శాశ్వత నివాస ధృవీకరణ డిమాండ్‌పై అత్యంత వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. తెలంగాణలో స్థానికత అనేది సెంటిమెంట్‌తో కూడిన అంశం కావడంతో, ఎంఐఎం అడిగినట్లు హడావుడిగా శాశ్వత నివాస పత్రాలు జారీ చేస్తే అది రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారానికి దారి తీస్తుంది, పైగా బీజేపీ దీనిని ప్రధాన ఆయుధంగా మార్చుకుంటుంది. చట్టపరంగా ఓటర్ల జాబితా సవరణ అనేది పూర్తిగా కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఏదేమైనా, ఈ స్పెషల్ రివిజన్ ప్రక్రియ పూర్తయ్యే సరికి పాతబస్తీ రాజకీయ చిత్రపటంలో ఓవైసీ మార్క్ ఏకపక్షాధిపత్యానికి బ్రేకులు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

# కేపీ రాజారెడ్డి జనసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు డ్యూయల్ డెస్క్ బెంచీల పంపిణీ

**ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి సారథ్యంలో రెండో విడత కార్యక్రమం**



**కామారెడ్డి,ప్రతిదీ జూలై 14 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో కేపీ రాజారెడ్డి జనసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో, కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి సారథ్యంలో చేపట్టిన రెండో విడత డ్యూయల్ డెస్క్ బెంచీల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎంపీపీఎస్ హరిజనవాడ, ఎంపీపీఎస్ అంబేద్కర్ నగర్, ఎంపీపీఎస్ హనుమాన్ మందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సరిపడా డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులు నేలపై కూర్చొని చదవాల్సిన పరిస్థితి లేకుండా, సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు ఈ డెస్క్ బెంచీలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, నాణ్యమైన విద్యకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం లక్ష్యంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని మరిన్ని ప్రభుత్వ పాఠశాలలకు కూడా దశలవారీగా డ్యూయల్ డెస్క్ బెంచీలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. డెస్క్ బెంచీలు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కేపీ రాజారెడ్డి జనసేవ ట్రస్ట్‌కు, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ట్రస్ట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి గ్రామంలో విద్యార్థులు సైన్స్‌పై పరిశోధనా దృక్పథం పెంపొందించుకోవాలి:

-మొదటిపేజీ తరువాయి

ల్యాబ్‌లు ఉన్న పాఠశాలలన్నీ ఈ కార్యక్రమాన్ని ఒక సవాల్‌గా స్వీకరించి అమలు చేయాలని ఆయన ఆదేశించారు. పాల్గొన్న అధికారులు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, పీడీ హౌసింగ్ విజయ్‌పాల్ రెడ్డి, మండల తహసీల్దార్ ఉమామలత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు కోసం ఊరికి వచ్చి.

-మొదటిపేజీ తరువాయి

నర్సింగ్‌రావుపల్లి గ్రామానికి చెందిన మంగలి అంజయ్య తన భార్య లక్ష్మి, కుమార్తె పూజతో కలిసి పదేళ్ల క్రితం ఉపాధి కోసం బీదర్‌కు వెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11న స్వగ్రామానికి వచ్చాడు. అయితే సోమవారం రాత్రి లేదా మంగళవారం తెల్లవారుజామున ఇంటి ఆవరణలో ఉన్న రేకుల షెడ్డు ఐరన్ పైప్‌కు తాడుతో ఉరివేసుకున్నాడు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన మంగలి రమేష్ గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు హుటాహుటిన తాడు కోసి కిందకు దించినప్పటికీ అప్పటికే అంజయ్య మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న నిజాంసాగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదులో, అంజయ్య కొంతకాలంగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈ నిర్ణయం తీసుకున్నాడని పేర్కొంది. ఈ ఘటనలో ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు లేవని ఆమె తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నిజాంసాగర్ ఎస్ఐ జే. శివకుమార్ తెలిపారు. అంజయ్య మృతి వార్త తెలిసిన వెంటనే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. ఓటరు నమోదు కోసం స్వగ్రామానికి వచ్చిన యువకుడు అనూహ్యంగా మృతి చెందడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# మహిళా సంఘాల్లో లేని ప్రతి అర్హత మహిళను సంఘాల్లో చేర్పించాలి

-మొదటిపేజీ తరువాయి

సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి అర్హ మహిళకు మహిళా సంఘంలో సభ్యత్వం పొందడం ఒక హక్కు అని కలెక్టర్ పేర్కొన్నారు.

అదేవిధంగా జిల్లాలో దివ్యాంగుల సంఘాలు, వృద్ధ మహిళల సంఘాల పనితీరుపై కూడా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఈ రెండు విభాగాల్లో పనితీరు ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా అర్హులైన ప్రతి దివ్యాంగుడు, 60 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళను సంబంధిత సంఘాల్లో సభ్యులుగా చేర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు సంఘాల్లో లేని మహిళలకు కూడా చీరల పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 33,102 మంది మహిళలకు చీరలు పంపిణీ చేయగా, అందులో 20,619 మందిని మహిళా సంఘాల్లో చేర్చాలని సెర్ప్ లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. జూలై 31లోపు ఈ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు ప్రతి గ్రామంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామ సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధుల సహకారంతో ఇంటింటికీ వెళ్లి సంఘాల్లో లేని అర్హ మహిళలు, దివ్యాంగులను గుర్తించి సభ్యత్వం కల్పించాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, అదనపు డీఆర్‌డీఓ, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## యుద్ధంలో సమిధలవుతున్న సామాన్యులు

పశ్చిమాసియాలో నెలకొన్న శాంతియుత పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారిపోయాయి. ఇరాన్ ను లక్ష్యంగా చేసుకుని అమెరికా భీకర దాడులకు దిగింది. ప్రతిగా ఇరాన్ కూడా ఎదురు దాడులకు దిగింది. యుద్ధం మూలంగా కేవలం ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా నే కాకుండా సమీపంలోని లెబనాన్,గల్ఫ్ దేశాలకు తీవ్ర నష్టం కలిగించింది. అటు ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించింది. యుద్ధం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు కొరత ఏర్పడి పలు దేశాలు లాక్ డౌన్ దిశగా అడుగులు వేస్తున్నాయి. యుద్ధం మూలంగా కేవలం ఆస్తి, ఆర్థిక నష్టమే కాదు పెద్ద ఎత్తున ప్రాణ నష్టం కూడా సంభవించింది. ముఖ్యంగా ఇరాన్‌లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ముక్కుపచ్చలారని చిన్నారులు ఎందరో ఉన్నారు. ఎన్నో వందల మంది గాయాలపాలయ్యారు. పరస్పర దాడుల్లో ఆ రెండు దేశాలకు ఏ మేర నష్టం వాటిల్లిందన్న విషయాన్ని పక్కనపెడితే?ఇరాన్ దాడుల్లో భారత్ కు చెందిన ఓ వాణిజ్య నౌక ధ్వంసం కాగా? అందులోని ఓ భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది.రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ఆ దేశాలకు చెందిన ఆస్తి, ప్రాణ నష్టాలు సర్వసాధారణమే అయినప్పటికీ? ఆ యుద్ధం కారణంగా ఇతర దేశాలకు.. అది కూడా అలీన ఉద్యమంతో ప్రపంచ శాంతికి బాటలు వేస్తున్న భారత్ లాంటి దేశాలకు నష్టం వాటిల్లుతుండటం గమనార్హం. అమెరికా, ఇరాన్ యుద్ధంలో భారత్ ఏ ఒక్క దేశానికి మద్దతు పలక లేదు. అదే సమయంలో ఇరు దేశాలు చర్చించుకుని ప్రపంచ శాంతికి పాలుపడాలని భారత్ ఆకాంక్షిస్తున్న సంగతీ తెలిసిందే. ఇలాంటి నేపథ్యంలో ఇరాన్ దాడిలో భారత నౌక ధ్వంసం కావడం, అందులోని ఓ భారతీయుడు గల్లంతు కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేందుకు జరుగుతున్న శాంతి ప్రయత్నాలపై తాజాగా జరుగుతున్న పోరాటం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఇక ఈ రెండు దేశాల మధ్య శాంత కల్లేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిపిన రెండు దాడుల కన్నా తీవ్రంగా ఆదివారం ఇరాన్‌లోని 140కు పైగా క్షిపణి, డ్రోన్ కేంద్రాలు, ఆయుధాగారాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ప్రాంతాలపై లక్షిత దాడులు చేసినట్టు అమెరికా ప్రకటించింది. 'ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అది మూల్యం చెల్లిస్తున్నది' అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆన్‌లైన్‌లో పోస్ట్ పెట్టారు. తాము మాత్రమే హ్హార్ముజ్ జలసంధిని నియంత్రించగలమని, దాని ద్వారా పయనించే నౌకలపై చార్జీలు విధించగలమని ఇరాన్ స్పష్టం చేసింది. ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ బాఘెర్ ఘాలిబాఫ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కాగా, ఇరాన్ క్షిపణులను తాము సమర్థంగా అడ్డుకున్నట్టు ఖతార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా క్షిపణి శకలాలు పడి ఒక పిల్లవాడు సహా ముగ్గురు పౌరులు గాయపడ్డట్టు తెలిపింది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను తాము కూడా అడ్డుకున్నట్టు కువైట్ మిలిటరీ ప్రకటించింది. ఆదివారం బహ్రెయిన్‌లో పౌరులకు మూడుసార్లు హెచ్చరిక సైరన్లు మోగాయి.సైప్రస్ జెండాతో భారత్ బయలుదేరిన జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌకపై ఓమన్ తీరం సమీపంలో హర్మూజ్ జల సంధికి చేరుకున్న సమయంలో ఇరాన్ నుంచి దూసుకువచ్చిన బాంబు పడింది. దీంతో గెలాక్సీ నౌకలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. నౌకలో మంటలు చెలరేగిన సమయంలో అందులో ఉన్న 11 మంది భారతీయులు దానిని వదిలేసి చిన్నపాటి లైఫ్ బోటులో ప్రాణాలు కాపాడుకునే యత్నం చేశారు. ఈ క్రమంలో 10 మంది భారతీయులు చిన్నబోటులో సురక్షిత ప్రాంతానికి చేరుకోగా? మరో వ్యక్తి మాత్రం గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. కాగా, ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిరకు ఇరాన్‌లో 8,531 మంది మరణించారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం హెచ్ఆర్ఏఎన్ఏ పేర్కొంది. వీరిలో 5,607 మంది సామాన్య పౌరులు ఉన్నారని తెలపడం గమనార్హం. అంతేకాదు మృతుల్లో 1244 మంది పిల్లలు కూడా ఉన్నారని పేర్కొనడం గుండెతరుక్కుపోయే విషం. క్షేత్రస్థాయి నివేదికలు, స్థానికుల సమాచారం, వైద్య, అత్యవసర వనరులు, అధికారిక ప్రకటనల ఆధారంగా తాము ఈ సమాచారాన్ని సేకరించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఆ సమాచారం ఆధారంగా ఇరాన్‌లో 5500 మందికి పైగా చనిపోయారని పేర్కొంది. ఇదిలా ఉండగా అంతర్జాతీయ సంస్థ అయిన రెడ్‌క్రాస్ వాదన మరోతీరు ఉంది. అమెరికా -ఇజ్రాయెల్ దాడుల మూలంగా ఇరాన్‌లో ఇప్పటివరకు కనీసం 3,900 మంది మరణించగా, 60,000 మంది గాయపడ్డారని పేర్కొన్నది. ఇక, మార్చి 2 నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1124 మంది చిన్నారులతో పాటు దాదాపు 3,368 మంది లెబనాన్ పౌరులు మరణించారని లెబనీస్ అధికారులు వెల్లడించారు. అలాగే, లెబనీస్ సాయుధ సంస్థ హిజ్బుల్లాకు చెందిన 400 మంది సైనికులు మరణించారని ఆ సంస్థ ప్రకటించింది. అలాగే ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాక్‌లో 702మంది మరణించారు.ఇరాన్ దాడికి ఖండిస్తూ ఆ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. దాడి జరిగిన సమయంలో ఓమన్ ప్రభుత్వం వేగంగా స్పందించి? ప్రమాదంలో పడిన భారతీయులను కాపాడిందని ఆ శాఖ తెలిపింది. భారతీయులను కాపాడిన ఓమన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. గల్లంతైన వ్యక్తి కోసం ఓమన్ దేశ సహాయక సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టినట్లు తెలిపింది.

# సామాన్య భక్తులకేనా దైవభీతి?

నేటి సమాజంలో కొందరి దృష్టిలో, కొన్ని చోట్ల వ్యాపారానికి పెద్ద కేంద్రంగా భక్తి మారింది. కొత్త ఆలయ నిర్మాణమంటే భక్తులు, పాలకమండళ్ల ప్రతినిధులు, పాలకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ఆలయం ఎంత పెద్ద స్థలంలో, ఎన్ని అంతస్తుల్లో కడుతున్నారన్నదే ప్రధాన అంశం అవుతున్నది. దేశంలో ఓ కొత్త గుడి కట్టగానే 'మీరు చూశారా? చూసొచ్చారా?' అనే చర్చ మొదలవుతున్నది. భక్తుల తాకిడి, హుండీ రాబడి పెరుగడంతో ఆలయ నిర్వాహకుల్లో ధన పిశాచి రెక్కలు విప్పుకొంటున్నది. దేవుడంటే భయభక్తులు ఉన్నవారు దర్శనాలతో తరిస్తుంటే, అస్సలు భయం లేనివారి దారి మరోలా ఉన్నది. చిన్న దొంగ తాను దొంగనని ఒప్పుకొంటాడు. పెద్ద దొంగ మాత్రం మహాభక్తుడిగా వేషం కట్టి, సంప్రదాయ పద్ధతులు పాటించి, అవకాశం చిక్కగానే బందిపోటుగా మారుతాడు. సాధారణ జనం నమ్మకం, ధనవంతుల పాపపరిహారం గుడులను బతికిస్తున్నాయి. గుడి ఆదాయాన్ని బట్టి నిర్వాహకుల ఆదాయం కూడా పెరుగుతుంది. ఆధునిక హిందూ దేవాలయ నిర్మాణాల్లో అయోధ్య రామాలయం సర్వోన్నతమైనది. ఈ ఆలయం పూర్తికావడానికి ఏడాది ఉండగానే భక్తుల రద్దీ పెరిగింది. అంత గొప్ప పేరున్న రామమందిరం ఈ మధ్య ఊహించని రీతిలో ఇంటి దొంగల బారిన పడి ఎంతోమంది పరువును గంగలో కలిపింది. భక్తిపారవశ్యంలో వరదలా వచ్చిన రామమందిర నిర్మాణ సొమ్ముకు లెక్కే లేకుండా పోయింది. ఆ ధనరాశుల ముందు నిర్వాహకుల భక్తి, నిష్ఠలు తేలిపోయాయి. దేవుడికిచ్చిన సొమ్ము గురించి భక్తులు లెక్కలు అడుగుతారా? అనే ధీమాతో తోచినంత దోచుకున్నారు. 2021లో ఈ ఆలయం కోసం సింధీ సమాజం ఇచ్చిన రూ.రెండు కోట్ల విలువైన వెండి ఇటుకలకు ఇంకా రసీదు అందలేదు. కానీ నకిలీ రసీదు పుస్తకాలు ముద్రణ అయ్యాయి. సీసీ టీవీల కంటపడకుండా నోట్ల సంచులు రోజుల తరబడి రవాణా అయ్యాయి. ఇదంతా తాత్కాలిక ఉద్యోగుల నిర్వాకమైనా..? పెద్దల అండ లేనిదే ఇదంతా సాధ్యం కాదు. 'ఇంత బరితెగిస్తారా?' అని ప్రజలు దిగ్భ్రాంతి చెందుతున్నారు. గుడి నిర్మాణాన్ని ప్రతిష్టగా తీసుకొన్న బీజేపీ పెద్దలు



కంగుతిన్నారు. ప్రజల ముందు ముఖం చాటేయలేక యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. సీఎం ఎన్ని సర్దుబాటు మాటలు మాట్లాడినా దోపిడీని కాదనలేని పరిస్థితి. ఇది బహిరంగ రహస్యమే కానీ, నోరు విప్పలేని అవస్థ. 'ఈ హుండీ దొంగల కేసులను ఎట్టిపరిస్థితిల్లోనూ వాదించబోం' అంటూ ఫైజాబాద్ న్యాయవాదుల సంఘం తేల్చిచెప్పింది. ఒకవేళ ఎవరైనా వాదించడానికి ముందుకు వస్తే వారికి రూ.5 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. జాతీయ ప్రసార మాధ్యమాలు, పత్రికల్లో రామాలయంలో జరిగిన భారీ దోపిడీపై విమర్శనాత్మక చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ, ఎద్దేవా చేస్తూ ఎన్నో రకాల కార్టూన్లు వస్తున్నాయి. ఆయా కార్టూన్ల ప్రభావం సామాన్య పాఠకులపై తప్పకుండా ఉంటుంది. ఇంత జరిగినా దుష్టశిక్షణ చేయాలని బాల రాముడికి అనిపించడం లేదా? అని సామాన్య భక్తులు ప్రశ్నిస్తున్నారు. అయోధ్య రామాలయంలో నిధులు స్వాహా అయ్యాయని తెలియగానే భక్తుల సంఖ్య, హుండీ ఆదాయం తగ్గాయనే వార్తలు వస్తున్నాయి. దేవుడనేవాడు ఈ విగ్రహాల్లో ఉంటాడా? పూజలు, యాగాలు ఆయన కోరుకుంటాడా? కానుకలు సమర్పిస్తే కోరికలు తీర్చుతాడా? అనే అనుమానాలు రాకుండా ఇంతకాలం గడిచింది. ఇప్పటివరకైతే అన్నీ దేవుడే చూసుకుంటాడు, వారి కర్మ వారే అనుభవిస్తారని దొంగలను వదిలేసే దయాగుణం భక్తులకు ఉన్నది. ఇంత భారీగా ఆలయ సొమ్ము కాజేసిన దొంగలకు తగిన శిక్ష పడుతుందన్న నమ్మకాన్ని కేంద్రం, యూపీ ప్రభుత్వం కలిగించాలి. రామ జన్మభూమిలో ఆలయ నిర్మాణ ఘనత తమదేనని చెప్పుకొనే బీజేపీ, గుడి పేరుతో రాజకీయంగా లబ్ధి పొందిన బీజేపీ, ఇప్పుడు ఎందుకు స్పందించదు? రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నప్పుడు మౌనం వహించడం ఎంతవరకు సమంజసం?

# ఈసీ కొత్త మెలిక!

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరిట దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో ఇప్పటికే దాదాపు అయిదున్నర కోట్లమంది ఓటర్లను జాబితాల్లోంచి తొలగించి రికార్డు సృష్టించిన ఎన్నికల సంఘం(ఈసీ)... కొత్త రికార్డులు నెలకొల్పాలని తహతహలాడుతున్నట్టు కన బడుతోంది. 2002 నాటి ఓటర్ల జాబితాలో గల తమ తల్లిదండ్రుల వివరాలు పొందుపరి స్తేనే కొత్తగా 18 యేళ్లు నిండినవారూ, ఓటుహక్కు పొందదల్చుకున్న ఇతరులూ అర్హులవు తారని విధించిన తాజా నిబంధన ప్రకంపనలు రేపుతోంది. బిహార్‌తో మొదలెట్టి ఇంత వరకూ వివిధ రాష్ట్రాల్లో జరిగిన 'సర్'లో లేని నిబంధన ఇప్పుడు కొత్తగా అందరి నెత్తినా పడేసింది. 2002 నాటికే తల్లిదండ్రులు మరణించివున్నా... అప్పట్లో సమయానికి ఇంట్లో లేకపోవటంవల్లనో, పనిపాటల కోసం వేరే ప్రాంతంలో ఉండటంవల్లనో వారి ఓటు హక్కు గల్లంతైవుంటే అలాంటి వాళ్ల పరిస్థితేమిటో చెప్పాలన్న స్పృహ కూడా దానికి లేకుండా పోయింది. అలాంటివాళ్లు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చనటం తప్ప మరేమీ వివరణ లేదు! తీరా ఇస్తే ఈ నిబంధన సాకుతో తిరస్కరించటం తప్ప ఒరిగేదేముంటుంది? ఒకరి తర్వాత ఒకరుగా వచ్చిన పాలకుల పుణ్యమా అని ఈ దేశంలో ఇతర చీడలతో పాటు నిరక్షరాస్యత కూడా నిక్షేపంగా ఉంది. 2011 నాటి లెక్కల ప్రకారం అక్షరాస్యత 74.04 శాతం. ఇప్పుడు జాతీయ సగటు 81 శాతమని అంటున్నారు. సంతకం పెట్టగలి గినపాటి జ్ఞానం వచ్చినవారిని అక్షరాస్యులుగా లెక్కేయటంవల్ల ఈమాత్రం కనబడుతోంది. తేలిగ్గా దేన్నయినా చదవగలిగేవారెందరో చెప్పలేం. అలాంటివారు ఇరవైయ్యేళ్ల క్రితం తమ ఓటు ఎక్కడుందో గుర్తుపెట్టుకుని పాత చిట్టాలు వెతకగలరా? ఒకవేళ గుర్తున్నా 2008 పునర్విభజనలో చాలా నియోజకవర్గాల పేర్లు, వాటి పరిధిలోని ఊళ్లు మారాయి గనుక వాస్తవంగా తమ ఓటు ఏ పరిధిలోకి పోయిందో తెలుసుకోలేరు. పైగా ఇది సాగు సీజన్. నాట్లు, యూరియా కొనుగోలు, ఇతరేతర పనుల కోసం రైతులు ఇప్పటికే తిప్పలు పడుతున్నారు. వారి పిల్లలు సైతం ఆ పనులు పంచుకుంటే తప్ప ఒక కొలిక్కి రాదు. జనాన్ని బాధించటానికి ఇంతకన్నా మంచి అదును ఈసీకి దొరకలేనట్టుంది! ఈసీ తీసుకొచ్చిన ఈ 'సర్' రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు చెప్పివుండొచ్చు. అందులో




చోటు దొరకనివారు ట్రిబ్యునళ్లను ఆశ్రయించవచ్చన్న వెసులుబాటు కల్పించి వుండొచ్చు. కానీ అది నిగ్గుతేలేసరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. బెంగాల్ సంగతే తీసుకుంటే జాబితాల్లో గల్లంతైనవారు లక్షల్లో ఉండగా... ట్రిబ్యునళ్లు తేల్చిన కేసులు మూడు, నాలుగు వేలు మించలేదు. ఇలాగైతే అంతా తేలేసరికి కనీసం పాతికేళ్లు పడుతుందని న్యాయ నిపుణులు లెక్కేస్తున్నారు. 'సర్'లో చోటు దొరక్కపోతే పింఛన్లు మొదలు కొని గ్యాస్ సిలెండర్ల సబ్సిడీ వరకూ సమస్తం ఆపేయటం కొన్ని రాష్ట్రాల్లో మొదలైంది. రేపో మాపో మీరు ఈ దేశ పౌరులు కాదు... ఇక్కడ ఉండటానికి అనర్హులని చెప్పినా ఆశ్చర్యం లేదు. పోనీ ఈసీ 'స్వచ్ఛమైన' జాబితాను రూపొందించగలుగుతోందా? పరకాల ప్రభాకర్ వంటి సామాజికవేత్తలు చెబుతున్నదాన్నిబట్టి చూస్తే యూపీలో కొన్ని చిరునామాల్లో వందలమంది ఓటర్లు నమోదైవున్నారు. ఇలాంటి ఆరోపణలకు ఈసీ వివరణ ఇచ్చిన దాఖలా లేదు. అసలు అలాంటి బాధ్యత ఉన్నట్టు కూడా అది గుర్తించే స్థితిలో లేదు. ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల టీడీపీ కార్యాలయాల్లో, ఆ పార్టీ నేతల ఇళ్లలో 'సర్' దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలి... ఎవరికి ఇవ్వకూడదన్న నిర్ణయాలు జరుగుతున్నా యని వైఎస్సార్ కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మీడియాలో ఫొటోలు, వీడియోలు వస్తున్నాయి. అయినా ఈసీ ఉలకదు, పలకదు. సంబంధిత బీఎల్ఓలపై చర్యలుండవు. ఈ తంతు గమనిస్తే ఇది 'తీసివేతల ఈసీ'గా కనబడుతోంది. గతంలో ఓటర్ల జాబితా సవరణలో కొత్తగా ఇన్ని లక్షలమంది జమ అయ్యారని... అందులో మొదటిసారి ఓటుహక్కు వచ్చినవారు ఇంతమంది అని ఈసీ గర్వంగా చెప్పుకునేది. ఇప్పుడు తీసివేతలే గర్వకారణంగా మారింది. ప్రపంచంలోనే అన్నీ డిజిటల్ చేశామని గొప్పగా చెప్పుకునే దేశంలో కాగితాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే స్థితి కల్పించిన ఘనత ఈసీది. మొత్తానికి ఆ సంస్థ మస్తిష్కంలో రేపటి రోజున ఎలాంటి ఆలోచనలు పుడతాయో, ఏం అమల్లోకొస్తుందో అని జనం భయపడే రోజులొచ్చాయి.

## పసిమొగ్గపై లైంగిక దాడి

**బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.!పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆరేళ్ల చిన్నారి ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్ళింది. స్కూల్ ముగిసిన తర్వాత తల్లి ఆమెను ఇంటికి తీసుకురావడానికి వెళ్లినప్పుడు, ఆ చిన్నారి తీవ్ర భయాందోళనలతో కలత చెంది కనిపించింది. ఇంటికి వచ్చిన తర్వాత భయపడుతూనే పాఠశాలలో జరిగిన ఘోరాన్ని తల్లిదండ్రులకు వివరించింది. తాను టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ తలుపు లోపల గడియ పెట్టి, బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పింది. ఆ సమయంలో నిందితుడి స్నేహితుడు వచ్చి బయటి నుండి తలుపు తట్టడంతో నిందితుడు చిన్నారిని వదిలేశాడు. లేకపోతే ఊపిరాడక స్పృహ కోల్పోయే స్థితికి ఆ చిన్నారి చేరుకుండేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ దారుణంపై చిన్నారి తల్లిదండ్రులు వెంటనే పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. అయితే, బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రిన్సిపాల్.. నిందితుడిని సమర్థించే ప్రయత్నం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పాఠశాల పరువు పోతుందని బెదిరిస్తూ, వారిని కూడా ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్లక్ష్యపూరిత చర్యపై ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. స్కూల్ ఎదుట ఆందోళన తీవ్రం కావడంతో చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది.బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, తక్షణమే అతడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పాపియా సుల్తానా స్పందిస్తూ.. బాధితురాలి వయసు, సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని మరిన్ని వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని, తక్షణమే కఠిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, నిందితుడిని కాపాడటానికి ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని, బాధితులను హేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన తోటి ఉపాధ్యాయులను కూడా సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది..


# కాళేశ్వరంపై బీజేపీ కిం కర్తవ్యం



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ఇప్పుడు సరికొత్త రాజకీయ వ్యూహాలు, ప్రతివ్యూహాలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఈ వ్యవహారంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరి రాజకీయ వర్గాల్లో తీవ్ర గందరగోళానికి దారి తీస్తోంది. ఒకవైపు కేంద్రంలోని తమ ప్రభుత్వ పరిధిలోని సంస్థ ఇచ్చిన నివేదికకు భిన్నంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాట్లాడుతుండడం, మరోవైపు దీనిని అధికార కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకుని విమర్శలు గుప్పించడంతో కాళేశ్వరం చుట్టూ రాజకీయం వేడెక్కింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి పరిశీలనలు జరిపింది. ప్రస్తుతానికి మేడిగడ్డ వద్ద నీటిని నిలపవద్దని, అలా చేస్తే బ్యారేజీ నిర్మాణానికి మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎన్డీఎస్ఏ స్పష్టమైన సిఫారసు చేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ మార్గదర్శకత్వంలోనే ఈ సంస్థ పనిచేస్తోంది. అయితే, విచిత్రంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం ఇందుకు భిన్నమైన డిమాండ్లను తెరపైకి తెస్తున్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ బహిరంగంగానే స్పందిస్తూ.. కాళేశ్వరంలో నీటిని నింపి, ఎత్తిపోయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అటు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు సైతం కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. కేంద్ర సంస్థ చెప్పినదానికి భిన్నంగా, రాష్ట్ర బీజేపీ నేతలు నీటిని నింపాలని కోరడం వెనుక ఉన్న వ్యూహం ఏంటో అర్థం కాక ఆ పార్టీ శ్రేణులే గందరగోళానికి గురవుతున్నారు. రాష్ట్ర బీజేపీ నేతల విమర్శలపై అధికార కాంగ్రెస్ పార్టీ అంతే దీటుగా స్పందిస్తోంది. తాము సొంత నిర్ణయాలు తీసుకోవడం లేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్డీఎస్ఏ సిఫారసులనే తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని ప్రభుత్వం గట్టిగా వాదిస్తోంది. ఒకవేళ ఎన్డీఎస్ఏ నివేదికను కాదని నీటిని నిలిపితే, భవిష్యత్తులో బ్యారేజీకి ఏమైనా నష్టం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. కేంద్ర సంస్థ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లేనిపోని సాంకేతిక, చట్టపరమైన సమస్యలు వస్తాయని ప్రభుత్వం వివరిస్తోంది. బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ఈ గందరగోళాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా పూర్తిగా వాడుకుంటోంది. బీఆర్ఎస్ చెప్పినట్లే బీజేపీ నేతలు ఆడుతున్నారంటూ కాంగ్రెస్ కొత్త పల్లవి అందుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, వైఫల్యాలపై బీఆర్ఎస్ తీరును గతంలో తప్పుబట్టిన బీజేపీ, ఇప్పుడు అదే బీఆర్ఎస్ లైన్‌ను ఎందుకు అందుకుందని ప్రశ్నిస్తోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే రంగంలోకి దిగి.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాసిన స్క్రిప్ట్ ప్రకారమే ఈటల రాజేందర్ నడుచుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, బీజేపీల మధ్య అంతర్గత అవగాహన కుదిరిందనే అనుమానాలకు ఈ వైఖరే నిదర్శనమని కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. వాస్తవానికి కాళేశ్వరం అవినీతిపై బీఆర్ఎస్‌ను గద్దె దించుతామని గతంలో బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను టార్గెట్ చేసే క్రమంలో, బీఆర్ఎస్ వాదనకు బలం చేకూర్చేలా మాట్లాడడం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు కేంద్ర సంస్థ నీళ్లు నిలపొద్దంటుంటే, మరోవైపు రాష్ట్ర నేతలు నీళ్లు నింపాలనడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై పార్టీలో సరైన సమన్వయం, స్పష్టత కొరవడిందని స్వయంగా బీజేపీలోని కొందరు ముఖ్య నేతలే అంతర్గత చర్చల్లో అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ ఎంత ఆలస్యమైతే అంత రాజకీయ ప్రయోజనం పొందాలని ఒకరు, కేంద్ర నివేదికలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను కట్టడి చేయాలని మరొకరు చూస్తున్నారు. ఈ రాజకీయ చదరంగంలో బీజేపీ తీసుకుంటున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు ఆ పార్టీకే తిప్పలు తెచ్చిపెట్టేలా కనిపిస్తున్నాయి.

## ఒక్కసారిగా తగ్గిన సల్కం చెరువు విస్తీర్ణం

# దుమారం రేపుతున్న యూ-టర్న్




**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే వినిపించిన 'చట్టం ఎవరికైనా ఒక్కటే' అనే నినాదం ఇప్పుడు పాతబస్తీ సల్కం చెరువు సాక్షిగా అభాసుపాలవుతోంది. పేదల ఇళ్లు, సామాన్య బిల్డర్ల భవనాలపై బుల్డోజర్లతో విరుచుకుపడే 'హైడ్రా' కన్ను, మిత్రపక్షమైన ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీకి చెందిన విద్యాసంస్థల దగ్గరకు వచ్చేసరికి మూతపడిందా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. చాంద్రాయణగుట్ట బండ్లగూడ ఖల్సాలోని సల్కం చెరువు పరిధిలో ఉన్న బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ వివాదంలో తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో తీసుకున్న అనూహ్యమైన యూ-టర్న్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారం రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం రాజకీయ ప్రయోజనాల కోసం నిబంధనలను ఎలా తుంగలో తొక్కిందో ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. సల్కం చెరువు ఆక్రమణలపై అడ్వకేట్ విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్ వెనుక సుదీర్ఘ పొలిటికల్ అండ్ లీగల్ డ్రామా దాగి ఉంది. 2016 లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ప్రాథమిక సర్వే నోటిఫికేషన్ ప్రకారం.. సల్కం చెరువు వైశాల్యం దాదాపు 36 ఎకరాల ప్రభుత్వ భూమి. అప్పట్లో అధికారికంగా విడుదల చేసిన మ్యాపులు ఈ ఒవైసీ విద్యాసంస్థల భవనాలు స్పష్టంగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నట్లు తేల్చిచెప్పాయి. కానీ, తాజా విచారణలో ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ కోర్టుకు సమర్పించిన మెమో చూసి స్వయంగా హైకోర్టే ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ విద్యాసంస్థలు అసలు ట్యాంక్ బెడ్ లేదా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే లేవంటూ ప్రభుత్వం క్లీన్ చిట్ ఇవ్వడం, మిషన్ కాకతీయ కింద చెరువు చుట్టూ రింగ్ బండ్ నిర్మించామని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ నీతిని బట్టబయలు చేసింది. 2016 నాటి నోటిఫికేషన్‌కు భిన్నంగా ఇప్పుడు చెరువు వైశాల్యం ఎలా కుంచించుకుపోయింది? రాజకీయ ఒత్తిళ్లతో ఎఫ్‌టీఎల్ సరిహద్దులను మార్చడానికి గల కారణాలేంటని ప్రశ్నిస్తూ ఇరిగేషన్, రెవెన్యూ, హైడ్రా శాఖలను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిలదీయడం ప్రభుత్వ వైఖరిని ఎండగడుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఎంఐఎం పార్టీతో అంతర్గతంగా నడుపుతున్న ఫ్రెండ్లీ బంధాన్ని కాపాడుకోవడానికే ఈ డిఫెన్సివ్ స్టాండ్ తీసుకున్నారనేది బహిరంగ రహస్యం. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డికి ఎంఐఎం పరోక్ష మద్దతు ఇస్తుండటంతో, పాతబస్తీ పెద్దలను నొప్పించకుండా ఉండేందుకు అధికారులు రీ-సర్వేల పేరుతో కాలయాపన చేసి, చివరకు నివేదికలనే మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఎంతటివారైనా సరే.. చెరువులను ఆక్రమిస్తే వదిలేది లేదు" అంటూ సీఎం రేవంత్ రెడ్డి బిల్డప్ ఇచ్చిన హైడ్రా బ్రాండ్ ఇమేజ్‌కు ఈ సల్కం చెరువు వ్యవహారం పెద్ద మచ్చగా మారింది. చట్టం అందరికీ ఒక్కటే అన్న సూత్రం అధికార పక్ష రాజకీయ అవసరాలకు లోబడి ఎలా మారిపోతుందో ఈ కేసు రుజువు చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ పక్షపాత నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందిస్తూ.. కాంగ్రెస్ నాయకులకు ఉచిత కంటి పరీక్షలు చేయించాలని ఎద్దేవా చేశారు. ఓవైసీ కాలేజీ చెరువులోనే ఉందన్న విషయం ప్రపంచం మొత్తానికి స్పష్టంగా కనిపిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించట్లేదని విమర్శించారు. పేదల ఇళ్లను కూల్చడానికి వేగంగా వచ్చే హైడ్రా, మిత్రపక్షం అక్రమ నిర్మాణాల దగ్గరకు వచ్చేసరికి వెనకడుగు వేస్తోందన్నారు. కాంగ్రెస్ రాజకీయ రంగోలీ వేసిన ప్రతిచోటా ఎఫ్‌టీఎల్ లైన్లు మాయాజాలంతో మారిపోతాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ప్రభుత్వం ఓవైసీ విద్యాసంస్థలను కాపాడటానికి ఎన్ని ప్రహసనాలు ఆడినా, న్యాయస్థానం మాత్రం ఈ కేసును తేలికగా వదిలేలా లేదు. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఈ కాలేజీకి అసలు అనుమతులు లేవని ఒకసారి, కేవలం ఇతర విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారని మరోసారి పరస్పర విరుద్ధ సమాధానాలు చెప్పడంపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావరణం, సహజ వనరుల రక్షణ ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశమని స్పష్టం చేస్తూ, అన్ని శాఖలు 3 వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ సర్కార్ నిబంధనలను తుంగలో తొక్కినా.. న్యాయస్థానం పర్యవేక్షణలో సల్కం చెరువు ఆక్రమణల నిజాలు త్వరలోనే పూర్తిగా బయటకు రావడం ఖాయంగా కనిపిస్తోంది.

## పరుగులు పెడుతున్న బుల్లెట్ ట్రైన్

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీనిలో భాగంగానే ఫ్యూచర్ సిటీ సహా బుల్లెట్ ట్రైన్, మెట్రో వ్యవస్థలను కీలకంగా తీసుకుంది. మెట్రో ను సైతం ప్రభుత్వమే కొనుగోలు చేసింది. దీనిని విస్తరించే ప్రతిపాదనను కూడా సర్కారు సిద్ధం చేసింది. ఇక, ఫ్యూచర్ సిటీని 14 వేల ఎకరాలకు పరిమితం చేయాలని అనుకున్నా.. ఇప్పుడు దాదాపు మరో 14 వేల ఎకరాలకు విస్తరించనుంది. మరోవైపు బుల్లెట్ రైల్ కారిడార్ ప్రతిపాదనలు కూడా రెడీ అవుతున్నాయి. ఇవన్నీ.. చెప్పుకొనేందుకు బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఏమేరకు సాకారం అవుతాయన్నది ప్రశ్నగా మారింది. దీనికి కారణం.. భూముల సమస్యే. అటు ఫ్యూచర్ సిటీ కోసం భూ సేకరణ (2013 నాటి చట్టం) చేపట్టాలని నిర్ణయించారు. కానీ, దీనికి అనుకున్న విధంగా ప్రజల నుంచి రెస్పాన్స్ రాలేదు. పైగా.. రాజకీయ జోక్యం పెరిగిందన్న టాక్ కూడా వినిపిస్తోంది. దీంతో భూసేకరణ వ్యవహారం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఇక, బుల్లెట్ ట్రైన్‌కు ఆదిలోనే రెడ్ సిగ్నల్స్ పడుతున్నాయి. బహదూర్‌పురలో భూములు ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. పైగా ఈ భూముల్లోనే ఎక్కువగా పంటలు పండుతుండడంతో రైతులకు సెంటిమెంటుగా మారింది. దీంతో వారు సదరు భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఇప్ప టికే చేపట్టిన సర్వేలో 30 శాతం మంది తమ భూములు ఇవ్వబోమని చెబుతున్నారు. ఒకవేళ భూములు కావాలంటే బహిరంగ ధరలకు కొనుగోలు చేయాలని చెబుతున్నారు. ఇది సర్కారుకు మరింత భారంగా మారనుంది. మెట్రో పరిస్థితి కూడా దాదాపు ఇలానే ఉంది. ఒకవైపు భూముల సమస్యలతో పాటు.. మెట్రో అలైన్‌మెంటు విషయంలో చోటు చేసుకున్న విమర్శలు రాజకీయంగా ఇరకాటంలోకి నెడుతున్నాయి. మరోవైపు కేంద్రం నుంచి ఆశించిన మేరకు సహకారం లేదని సీఎం రేవంత్ స్వయంగా చెబుతున్నారు. రుణం విషయంలోనూ సర్కారు స్పందించడం లేదని అంటున్నారు. ఈ పరిణామాలతో ఈ మూడు ప్రాజెక్టులు కూడా ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా మారడం గమనార్హం. కానీ, మరో రెండు సంవత్సరాల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో వీటిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

## రేవంత్ ఐదున్నర ఏళ్ల సీఎం..

**హైదరాబాద్ :** రెండు తెలుగు రాష్ట్రాలలో గతంలో చూడని ముచ్చట రానున్న కాలంలో చూడబోతున్నామా అంటే జవాబు అవును అనే వస్తోంది. ఉమ్మడి ఏపీ కానీ అంతకు ముందు ఆ తరువాత విభజన ఏపీలో తెలంగాణాలో కానీ అయిదేళ్ళ సీఎంలను ఇంకా చెప్పాలంటే అంతకు తక్కువ పదవీ కాలం పనిచేసిన ముఖ్యమంత్రులనే అంతా చూశారు. అతి తక్కువ కాలం పనిచేసిన నెల రోజుల సీఎం గా నాదెండ్ల భాస్కరరావు ఒక రికార్డు క్రియేట్ చేశారు. ఇపుడు అయిదున్నరేళ్ళకు పైగా సీఎం గా పనిచేసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త రికార్డు క్రియేట్ చేయబోతున్నారా అంటే రేవంత్ రెడ్డి మాటలను బట్టి చూస్తే జరగబోయేది అదే అని అర్థం అవుతోంది ఆరు నెలలు ముందుకు : రేవంత్ రెడ్డి తాజాగా ఖమ్మం జిల్లాలో జరిగిన సభలో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఎన్నో ఆలోచనలు ప్రశ్నలు చర్చలకు తావిస్తున్నాయి. ఆయన ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాకు షెడ్యూల్ ప్రకారం 2028 డిసెంబర్ లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఈ ఎన్నికలు 2029 మే లేదా జూన్ లో జరుగుతాయని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఈ లెక్కన చూస్తే మరో ఆరేడు నెలల పాటు తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని అర్థం అవుతోంది. అంతే రేవంత్ రెడ్డి ఏకంగా అయిదున్నర ఏళ్ళకు పైగా ముఖ్యమంత్రిగా ఉంటారని కూడా దీనిని బట్టి చెప్పుకోవాల్సి ఉంటుంది. అదే జరిగితే తెలంగాణాలో విపక్షాలకు అది భారీ షాక్ అని చెప్పాల్సి ఉంటుంది. విపక్షాలు అంటే బీజేపీ కాదు, బీఆర్ఎస్ అని కూడా ఇక్కడ భావించాలి. ఎందుకంటే బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఆ పార్టీ తలచుకుంటేనే తెలంగాణాలో సార్వత్రిక ఎన్నికలు మరో ఆరు నెలల పాటు పొడిగించబడతాయి. దాంతో మరో రెండేళ్ళ ఆగండి మనదే ప్రభుత్వం అని తరచూ బీఆర్ఎస్ అగ్ర నేతలు జనాలకు పార్టీ జనాలకు చెబుతున్నారు. ఇపుడు వారే దిగాలు పడాల్సి ఉంటుంది. రాజకీయాల్లో ప్రతీ క్షణం విలువ అయినదే. అలాంటిది ఏకంగా ఆరేడు నెలలు కాంగ్రెస్ కి అదనంగా కలసి వస్తే కనుక కచ్చితంగా తెలంగాణా రాజకీయ సమీకరణలనే అది సమూలంగా మార్చేసే చాన్స్ ఉంటుంది. అలాంటపుడు మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశమూ ఉండొచ్చు. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి చెప్పిన ఈ మాటలు అయితే ఇపుడు తెలంగాణా రాజకీయాల్లో బిగ్ డిబేట్ గా మారబోతున్నాయని చెప్పక తప్పదు. దేశంలో ఇందిరమ్మ తరువాత : ఇక రేవంత్ రెడ్డి అన్న మాట ప్రకారమే తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికలు మరో ఆరు నెలల పాటు పొడిగించబడితే మాత్రం కచ్చితంగా రేవంత్ రెడ్డి రికార్డు క్రియేట్ చేసినట్లే. దేశంలో ఆరేళ్ళ పాటు ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ టైం లో పనిచేశారు. ఆ విధంగా రేవంత్ రెడ్డి కూడా అయిదేళ్ళకు మించి అయిదున్నరేళ్ళ పాటు సీఎం గా పనిచేస్తే అది ఎప్పటికీ బ్రేక్ చేయలేని రికార్డుగా ఉండే అవకాశం ఉంది. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి తాజా సభలో చేసిన సంచలన కామెంట్స్ బిగ్ డిబేట్ కి దారి తీస్తున్నాయి. మరి దీని మీద బీఆర్ఎస్ నేతలు ఎలా రియాక్ట్ అవుతారో చూడాల్సిందే.

### కేరాఫ్ ఎంహెచ్ ఆర్డీ భవన్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ చతురతను మరోసారి చాటుకున్నారు. ఎంసీహెచ్‌ఆర్డీలో నిర్మించిన తన క్యాంపు ఆఫీసును మీడియా అందరికీ చూపించారు. బీఆర్ఎస్ చేస్తున్న అల్ట్రా లగ్జరీ..వందల కోట్ల బడ్జెట్ వంటి ఆరోపణలకు లైవ్ స్పందన ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో పాటు తాను కూడా స్వయంగా వారితో పాటు తిరిగారుఈ వ్యతిరేక ప్రచారాలకు చెక్ పెట్టాలని భావించిన సీఎం రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఎలాంటి దాపరికం లేదనే సంకేతాన్ని ఇస్తూ.. ఏకంగా మీడియా ప్రతినిధులందరినీ స్వయంగా నూతన క్యాంపు ఆఫీస్ ప్రాంగణంలోకి తీసుకెళ్లి ప్రతి విభాగాన్ని చూపించారు. భవనం లోపల ఉన్న ఇంటీరియర్ డిజైన్ల నుండి ప్రతీ చిన్న విషయాన్ని జర్నలిస్టులకు దగ్గరుండి వివరించారు. లగ్జరీ హంగులు, ఆర్భాటాలు లేకుండా ఒక సాదాసీదా మధ్యతరగతి ఇల్లు ఎలా ఉంటుందో, ఈ ప్రభుత్వ భవనం కూడా అలాగే ఉందనే విషయాన్ని కళ్లారా చూసేలా మీడియాకు స్పష్టమైన విజువల్స్ అందించారు. ముఖ్యంగా నివాస నిబంధనల పరిధిలోనే, పరిపాలనకు అవసరమైన రీతిలో మాత్రమే నిర్మాణం జరిగిందని రుజువు చేశారు. జర్నలిస్టులను స్వయంగా రెస్ట్‌రూమ్ వరకు తీసుకెళ్లిన ఆయన.. గత కేసీఆర్ పాలనలో కట్టిన ప్రగతి భవన్ లాగా నా ఆఫీసులో ఎలాంటి బుల్లెట్‌ప్రూఫ్ బాత్‌రూమ్స్ లేవు అంటూ సెటైర్లు వేశారు. గతంలో ప్రగతి భవన్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలు, బుల్లెట్‌ప్రూఫ్ కిటికీలు, బాత్‌రూమ్‌ల గురించిన తీవ్రమైన వివాదాలను గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో అలాంటి రహస్యాలు, విలాసాలు ఏవీ లేవని మీడియా సాక్షిగా నిరూపించారు. బీఆర్ఎస్ చేస్తున్న విలాసవంతమైన భవనమనే ఆరోపణల్లో ఎలాంటి సత్యం లేదని తేల్చిచెప్పారు. వ్యూహాత్మకంగా సాగిన ఈ మీడియా టూర్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టినట్లయింది. ఒకవైపు ప్రతిపక్షం లేవనెత్తిన భవన వ్యయం, విలాసాల గాసిప్స్‌కు క్షేత్రస్థాయి ఆధారాలతో అడ్డుకట్ట వేయగా.. మరోవైపు ఈ ఆఫీసు వల్ల చుట్టుపక్కల ఉండే సామాన్య ప్రజలకు, రాకపోకలు సాగించే వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవనే క్లారిటీని ఇచ్చారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని చాటిచెబుతూ, గత పాలకుల రహస్య వైభవానికి.. ఇప్పటి ప్రజా ప్రతినిధుల సరళత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజల ముందుంచడంలో రేవంత్ రెడ్డి మార్క్ పొలిటికల్ స్ట్రాటజీ పూర్తిగా సక్సెస్ అయిందని అనుకోవచ్చు.

## మాజీ మంత్రి ఓటు గల్లంతు

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న వేళ మాజీ మంత్రి ఓటే గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణకుమారి పేరు గుంటూరు నగర ఓటరు జాబితాలో కనిపించకపోవడంతో ఆమె అధికారులను ఆశ్రయించారు. ఒక మాజీ మంత్రి ఓటే లేకపోతే సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఓటరు జాబితాలో తన పేరు లేదని ఎన్నికల అధికారులు చెప్పడంతో అరుణకుమారి ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన ఓటును పునరుద్ధరించాలని కోరారు. డాక్టర్ శనక్కాయల అరుణకుమారి 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రెండో మంత్రివర్గంలో ఆమెకు మంత్రి పదవి దక్కింది. ఇదిలా ఉండగా, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. ఇంటింటి సర్వే, డిజిటలైజేషన్ ప్రక్రియకు జూలై 14 చివరి గడువుగా నిర్ణయించారు.

# వాణిజ్య నౌకలపై దాడులు ఆగిపోవాలి



హర్మూజ్ జలసంధి వంటి అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించడాన్ని, అందులోని సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన లక్షిత దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి చెందిన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) మహమ్మద్ జావాద్ హొస్సేనీను భారత విదేశాంగ శాఖ పిలిపించిన వెంటనే ఈ అధికారిక ప్రకటన వెలువడింది. కాగా, ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడి చేయగా, ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. అనంతరం భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది.

సముద్ర మార్గాల్లో దాడులు పునర్ ప్రారంభం కావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో ప్రశాంతత, భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు శత్రుత్వాలకు తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చింది. అలాగే శాంతి కోసం చర్చలు, దౌత్యపరమైన సంప్రదింపులు జరపాలని కోరింది. అంతర్జాతీయ చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ప్రపంచ నౌకాయాన మార్గాల్లో అడ్డంకులు లేని రాకపోకలు, సముద్ర వాణిజ్యాన్ని త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియాలోని వాణిజ్య నౌకలు, సైనికేతర కేంద్రాలపై దాడులు ఆగిపోవాలని పేర్కొంది.

**'క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం'**

ఒమన్ తీరంలో అల్ బాహియా, మొంబాసా అనే పేరు గల రెండు నౌకలపై జరిగిన దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన చెందుతోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ రెండు నౌకల్లో మొత్తం 46 మంది సిబ్బంది ఉండగా, వారిలో 30 మంది భారతీయులేనని తెలిపారు. అల్ బాహియాలో పనిచేస్తున్న 12 మంది భారతీయులలో ఒకరు మరణించారని, మరొకరు గాయపడ్డారని పేర్కొన్నారు. మొంబాసాలో ఉన్న 18 మంది భారతీయుల్లో 9 మంది సిబ్బంది గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని వెల్లడించారు. అలాగే మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

"బాధిత భారతీయ నావికులకు అవసరమైన సహాయం అందేలా చూసేందుకు యూఏఈలోని ఇండియన్ ఎంబసీ, కాన్సులేట్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. యూఏఈ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయ నావికుడు మరణించాడు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన తెలియజేయడానికి మంగళవారం దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌ను భారత్ పిలిపించింది. పశ్చిమాసియాలో జరుగుతున్న అన్ని పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాం. హర్మూజ్ జలసంధి గుండా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన నౌకాయానానికి, వాణిజ్యానికి మద్దతుగా మేము మా వైఖరిని స్థిరంగా కొనసాగిస్తున్నాం. ఎందుకంటే హర్మూజ్‌లో నౌకాయానం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక, ఇంధన భద్రతను కల్పించడంలో సహాయపడుతుంది" అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

**అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం : యూఏఈలోని ఇండియన్ ఎంబసీ**

హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై జరిగిన దాడిలో భారతీయ నావికుడు మరణించడంపై యూఏఈలోని ఇండియన్ ఎంబసీ స్పందించింది. భారతీయ నావికుడి మృతికి సంతాపం తెలిపింది. అక్కడి పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. "అల్ బహియా, మొంబాసా అనే రెండు నౌకలపై జరిగిన దాడుల్లో ఒక భారతీయ నావికుడు విషాదకరంగా మరణించడం పట్ల మేము సంతాపం తెలియజేస్తున్నాం. అక్కడి పరిస్థితిని మేము నిశితంగా గమనిస్తున్నాం. గాయపడిన వారికి, వారి కుటుంబాలకు అండగా ఉండడానికి స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని యూఏఈలోని ఇండియన్ ఎంబసీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

**ఇరాన్‌పై యూఏఈ ఫైర్**

మరోవైపు, హర్మూజ్‌లో తమ దేశ నౌకలపై దాడుల జరగడంపై యూఏఈ తీవ్రంగా మండిపడింది. ఈ దాడులను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా పేర్కొంది. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని తెలిపింది. పరిస్థితిని ఎదుర్కొనేందుకు భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసినట్లు ప్రకటించింది. ఇరాన్ వెంటనే ఇలాంటి రెచ్చగొట్టే దాడులను నిలిపివేయాలని, అన్ని రకాల ఘర్షణలను షరతులు లేకుండా విరమించాలని, హర్మూజ్‌ను పూర్తిగా తెరవాలని కోరింది. ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం కోసం ఇది అత్యవసరమని అభిప్రాయపడింది.

# "కోర్టునే తప్పుదోవ పట్టిస్తారా?



దివ్యాంగులపై జోకులు వేసి, కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించిన హాస్య నటుడు సమయ్? రైనా, యూట్యూబర్లు రణవీర్ అల్హాబాదియా, ఆశీష్? చంచలానీలపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వీరంతా తమకు తాముగా 'యూత్ ఐకాన్లు'గా ప్రకటించుకున్నారని వ్యాఖ్యానించింది. సమయ్ రైనా, రణ్‌వీర్ అల్హాబా దియాతోపాటు మరికొందరు కమెడియన్లు దివ్యాంగులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఎస్?ఎంఏ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనితో గతంలో విచారణ చేసిన న్యాయస్థానం, దివ్యాంగులకు గౌరవ, మర్యాదలు ఇవ్వాలని, వారి విజయాల గురించి ఈ కమెడియన్స్? తమ షోలలో చెప్పాలని ఆదేశించింది. అంతేకాదు తమ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వచ్చిన నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది. తాజాగా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దీనిపై మరోసారి విచారణ చేపట్టింది. సమయ్ రైనా తన షోకి వికలాంగులను ఆహ్వానించకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

"సమయ్ రైనా కోర్టును తప్పుదోవ పట్టించానడంలో మాకు ఎలాంటి సందేహం లేదు. ఈ కోర్టు ముందు ఇచ్చిన ఉత్తర్వులను అతడు పూర్తిగా బరితెగించి ఉల్లంఘించాడు. నిన్న కంప్లయన్స్? అఫిడవిట్? దాఖలు చేశామని పేర్కొన్నాడు. కానీ అతను ఎలాంటి అఫిడవిట్ దాఖలు చేయలేదు. ఇది తీవ్రమైన దుష్ప్రవర్తన. దేశం వెలుపల ఉండడం వల్ల తాము న్యాయవ్యవస్థ పరిధికి అతీతులమని వారు భావిస్తున్నారు. ఇది అహంకారం కాకపోతే మరేంటి? ఒకవేళ ఇది అహంకారం కాకపోతే, మనం ఆక్స్?ఫర్డ్ డిక్షనరీని కూడా మార్చాలి ఉంటుంది" అని సీజేఐ సూర్యకాంత్? ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత సమయ్? రైనాకు రూ.10 లక్షల జరిమానా విధించారు. తరువాత అతని న్యాయవాది అభ్యర్థనతో దానిని రూ.3 లక్షలకు తగ్గించారు. మరోసారి తప్పు చేస్తే ఈ మొత్తాన్ని రూ.30 లక్షలకు పెంచుతామని హెచ్చరించారు. జరిమానాను 2 వారాల్లోగా సుప్రీంకోర్టుకు జమ చేయాలని సీజేఐ ఆదేశించారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

"స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్?ఎంఏ) వ్యాధి చికిత్సకు అయ్యే అధిక ఖర్చుపై సమయ్ రైనా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అక్కడితో ఆగకుండా ఆ వైకల్యం ఉన్న ఒక వ్యక్తిని ఎగతాళి చేశాడు" అని క్యూర్ ఎస్ఎంఏ ఇండియా ఫౌండేషన్ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. 'ఇండియాస్ గాట్ లేటెంట్' హోస్ట్‌గా ఉన్న సమయ్ రైనాతోపాటు ఇతర సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు విపున్ గోయల్, బాల్‌రాజ్ పరమ్‌జీత్ సింగ్ ఘాయ్, సోనాలీ థక్కర్, నిశాంత్ జగదీశ్ తన్వర్ దివ్యాంగులపై వేసిన అసభ్యకరమైన, అనుచితమైన జోకులు గురించి తెలిపింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సదరు సంస్థ తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ అపరాజితా సింగ్, సమయ్ రైనా తను నిర్వహించిన షోలకు దివ్యాంగులనుకానీ, తమను కానీ ఆహ్వానించలేదని చెప్పారు. దీనితో సుప్రీంకోర్టు సదరు ఇన్‌ఫ్లూయెన్సర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

వికలాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కఠిన చట్టం అవసరమని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే దివ్యాంగులను, అరుదైన జన్యుపరమైన రుగ్మతలతో బాధపడేవారిని అవమానంచేలా లేదా ఎగతాళి చేసేలా వ్యాఖ్యలు చేయడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలని పేర్కొంది. ఇందుకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అంతేకాదు భవిష్యత్తులో తమ ప్రవర్తన పట్ల జాగ్రత్తగ ఉండాలని ఇన్?ఫ్లూయెన్సర్లను హెచ్చరిస్తూ, దివ్యాంగుల విజయగాథనలపై నెలకు రెండు కార్యక్రమాలు లేదా షోలు నిర్వహించాలని సమయ్ రైనాను, ఇతరులను ధర్మాసనం ఆదేశించింది. కానీ వారు అలా చేయకపోవడంతో తాజాగా సుప్రీంకోర్టు వారిపై ఆగ్రహం వ్యక్తం చూస్తూ, జరిమానా విధించింది.

# 3 ఏళ్ల ఫీజు వాపసు ఇచ్చేయండి

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పెంపుపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గత నాలుగేళ్ల ఫీజు రికార్డులను పది రోజుల్లోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఏటా 5 శాతానికి పైగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు, ఆ అదనపు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించాలని పేర్కొన్నారు. ఇకపై ఫీజు రికార్డులకు సంబంధించిన సమాచారం విద్యాశాఖ పోర్టల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఇకపై ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5శాతానికి మించి పెంచకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు సీఎం. ఒకవేళ ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పాఠశాలలపై రూ.50వేల నుంచి రూ.1 లక్షవరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే, ఆ పాఠశాల గుర్తింపును కూడా రద్దు చేస్తామన్నారు. ఈ మేరకు కొత్త ఆర్డినెన్స్? జారీ చేశారు. అయితే, ఈ నిర్ణయం ద్వారా పంజాబ్‌లోని దాదాపు 32లక్షలకు పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రయోజనం పొందుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఆర్డినెన్స్ అమలుతో, పంజాబ్‌లోని ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5 శాతానికి మించి పెంచలేవని సీఎం భగవంత్? మాన్ తెలిపారు. ఒకవేళ ఏదైనా పాఠశాల దీనికంటే ఎక్కువగా ఫీజులను పెంచాలనుకుంటే, సంబంధిత అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి చెప్పారు. అలాగే, గత ప్రభుత్వాలు అనవసరమైన ఫీజులు విధించడానికి ప్రైవేట్ విద్యా సంస్థలను అనుమతించాయని, దీనివల్ల విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. అయితే, విద్యా సంస్థలు, వివిధ ఖాతాల ద్వారా ఫీజులు వసూలు చేసి, విద్య పేరుతో లాభాలు ఆర్జించకూడదని తెలిపారు. మరోవైపు, ఈ ఆర్డినెన్స్?కు ఆమోదం తెలిపిన గవర్నర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "పంజాబ్ విద్యార్థుల తల్లిదండ్రులకు అనుకూలమైన ప్రయోజనాలను చేకూర్చడానికి మేం తీసుకున్న ఈ నిర్ణయానికి ఆమోద ముద్ర వేసినందుకు గవర్నర్ సాహెబ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన 'పంజాబ్ రెగ్యులేషన్ ఆఫ్ ఫీజు ఆఫ్ అన్‌ఎయిడెడ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (సవరణ) ఆర్డినెన్స్ 2026'పై ఆయన సంతకం చేశారు.

## హర్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిజానికి సోమవారం నాడే ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి. మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.

## ఏఐ ఉపయోగించండి...
## సైబర్ భద్రత పటిష్ఠం చేయండి

బ్యాంకింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, సైబర్ భద్రతను పటిష్ఠం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులకు పిలుపునిచ్చారు. వినియోగదారులకే పెద్దపీట వేయాలని అన్నారు. మంగళవారం ముంబైలో ప్రభుత్వ రంగ మరియు ఎంపిక చేసిన ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో ఆర్బీఐ నిర్వహించిన అర్ధవార్షిక సమావేశంలో ఆయన ఈ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ గవర్నర్‌తో పాటు డిప్యూటీ గవర్నర్లు స్వామినాథన్ జె., డా. పూనమ్ గుప్తా, ఎస్. సి. ముర్ము, రోహిత్ జైన్‌లతో పాటు పలువురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భారత బ్యాంకింగ్ రంగం అన్ని విభాగాల్లోనూ విస్తృతమైన వృద్ధిని సాధించిందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో, ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు వివేకంతో కూడిన మద్దతును కొనసాగించాలని ఆయన బ్యాంకులను కోరారు. బ్యాంకింగ్‌లో టెక్నాలజీ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని గవర్నర్ సూచించారు. దీని ద్వారా సేవలను విస్తరించవచ్చని, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని, ఖర్చులను తగ్గించుకోవచ్చని ఆయన వివరించారు. అదే సమయంలో, సైబర్ దాడుల నుంచి రక్షణకు బలమైన వ్యవస్థలు, పటిష్ఠమైన అంతర్గత నియంత్రణలు తప్పనిసరి అని నొక్కి చెప్పారు. కస్టమర్ల డేటా దుర్వినియోగం కాకుండా, మోసాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ (జఖజ=), నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు, మ్యూల్ హంటర్ కార్యక్రమం, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (జదీణజ), యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (ఖూ×), అకౌంట్ అగ్రిగేటర్ ఫ్రేమ్‌వర్క్ వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమాలపై బ్యాంకుల ప్రతినిధులు తమ అభిప్రాయాలను, ఫీడ్‌బ్యాక్‌ను ఆర్బీఐకి అందించారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని వారు పునరుద్ఘాటించారు.

## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ



ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో అణ్వస్త్రాల ప్రయోగం జరగకుండా నివారించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోస్జెస్కీ ప్రశంసించారు. 2022 చివరి నాటికి ఉక్రెయిన్‌పై అణుదాడికి రష్యా సిద్ధమవుతోందన్న ఆందోళనలు వ్యక్తమైన తరుణంలో, ప్రధాని మోదీ జోక్యం చేసుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఒప్పించగలిగారని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో విశేష గౌరవం పొందిన గొప్ప రాజనీతిజ్ఞుడు. భారత్‌కు రష్యాతో చారిత్రక, సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. అందుకే మోదీ మాటలను పుతిన్ అత్యంత శ్రద్ధతో వింటారు" అని పేర్కొన్నారు. రష్యాపై ప్రభావం చూపగలిగే అతికొద్ది మంది ప్రపంచ నేతల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు మోదీ కూడా ఒకరని బార్టోస్జెస్కీ వివరించారు. 2022 ద్వితీయార్ధంలో ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చినప్పుడు, రష్యా అణ్వస్త్రాలను ప్రయోగించవచ్చున్న భయాందోళనలు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నాయి. అయితే అప్పట్లో పెను ప్రమాదం తప్పడం వెనుక మోదీ దౌత్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మొదట్లో రష్యా నుంచి భారత్ రాయితీపై చమురు కొనుగోలు చేయడాన్ని పోలండ్ విమర్శించినప్పటికీ, ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయని, ఒకరి ఆర్థిక, వ్యూహాత్మక అవసరాలను మరొకరు గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో భారత్ మొదటి నుంచి తటస్థ వైఖరిని అనుసరిస్తోంది. కేవలం దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. అటు రష్యాతో ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూనే, ఇటు శాంతి స్థాపన కోసం పిలుపునిస్తోంది. ఈ క్రమంలో, ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తున్న నాటో సభ్యదేశం పోలండ్ నుంచి మోదీ పాత్రపై ఈ స్థాయిలో ప్రశంసలు రావడం అంతర్జాతీయంగా భారత్ దౌత్య ప్రాముఖ్యతను చాటుతోంది.

## బిజినెస్

# బ్యాంకర్లకు బీమా దన్ను..

**2025-26లో ఎస్బీఐకి రూ.2,800 కోట్ల ఆదాయం**
**మ్యూచువల్ ఫండ్ పంపిణీలపైనా ఆర్జన**
**సర్కారీ బ్యాంకులకు అధిక కమీషన్లు**



**ముంబై :** ప్రభుత్వ రంగ బ్యాంకులు గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో బీమా ఉత్పత్తుల అమ్మకాల నుంచి కమీషన్ల రూపంలో పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించాయి. బ్యాంకర్ల వార్షిక నివేదికలను విశ్లేషించిన పీటీఐ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎస్బీఐ అత్యధికంగా రూ.2,795. 01 కోట్లను ఇన్సూరెన్స్ కమీషన్‌గా పొందింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2024-25)తో పోల్చితే 19.26 శాతం పెరిగింది. నాడు రూ.2,345.36 కోట్లను అందుకున్నది. కాగా, 2025-26కుగాను ఎస్బీఐకి బీమా కమీషన్‌గా వచ్చిన ఆదాయంలో 85 శాతం (రూ.2,384.63 కోట్లు) తమ జీవిత బీమా అనుబంధ సంస్థ ఎస్బీఐ లైఫ్ పాలసీల పంపిణీ ద్వారానే సమకూరింది. ఇక కెనరా బ్యాంక్‌కు రూ.566.36 కోట్లు, యూనియన్ బ్యాంక్‌కు రూ.475.45 కోట్లు, పీఎన్‌బీకి రూ.438.67 కోట్లు, బీవోబీకి రూ.368.93 కోట్లు, ఇండియన్ బ్యాంక్‌కు రూ.190.65 కోట్లు, సెంట్రల్ బ్యాంక్‌కు రూ.160.90 కోట్లు, యూకో బ్యాంక్‌కు రూ.66.08 కోట్లు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ కు రూ.31.98 కోట్లు బీమా కమీషన్‌గా వచ్చాయి.

**మ్యూచువల్ ఫండ్స్‌లో..**

బీమా కమీషన్ల ఆదాయంలో మెజారిటీ ప్రభుత్వ బ్యాంకులు వృద్ధిని కనబర్చగా.. మ్యూచువల్ ఫండ్ పంపిణీలో మాత్రం ఆ స్థాయి వృద్ధిరేటు నమోదు కాలేదు. ఎస్బీఐకి గతంతో పోల్చితే 7.05 శాతం పెరిగి రూ.1,511.06 కోట్ల నుంచి రూ.1,617.52 కోట్లకు మ్యూచువల్ ఫండ్ పంపిణీ నుంచి కమీష న్ ఆదాయం వచ్చింది. ఇందులో బ్యాంక్ అనుబంధ సంస్థ ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్ వాటానే రూ.1,209.33 కోట్లుగా ఉన్నది. అలాగే కెనరా బ్యాంక్ రూ.72.84 కోట్లు, బీవోబీ రూ.142.52 కోట్లు, పీఎన్‌బీ రూ.163.41 కోట్లు, యూనియన్ బ్యాంక్ రూ.29.66 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.4.74 కోట్లు, యూకో బ్యాంక్ రూ.2.23 కోట్లను మ్యూచువల్ ఫండ్ పంపిణీ నుంచి కమీషన్‌గా ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన సంవత్సర కాలంలో దక్కించుకున్నాయి. కాగా, బ్యాంకులు తమ అసలు వ్యాపార కార్యకలాపాలైన డిపాజిట్లు, రుణాల పంపిణీపై దృష్టి పెట్టాలని, బీమా పాలసీలు, మ్యూచువల్ ఫండ్స్ పంపిణీలపై కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈమధ్యే సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం కమీషన్ల ఆదా యం ఎలా ఉంటుందో తేలాల్సి ఉన్నది.

## మార్కెట్‌లో గల్ఫ్ గుబులు.. భారీ నష్టాల్లో స్టాక్ సూచీలు

# సెన్సెక్స్ 561, నిఫ్టీ 159 పాయింట్లు డౌన్



**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ గల్ఫ్ యుద్ధం భయాలు ఆవహించాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తకర వాతావరణం.. పశ్చిమాసియాను మరోమారు సంక్షోభంలోకి నెట్టగా, అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తిరిగి విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం మదుపర్లు ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. ఫలితంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 561.46 పాయింట్లు లేదా 0.72 శాతం పతనమై 77,054.94 వద్దకు పడిపోయింది. ఒకానొక దశలోనైతే 614.92 పాయింట్లు లేదా 0.79 శాతం దిగజారడం గమనార్హం. దీంతో అంతకుముందు వరుస 3 రోజుల లాభాలకు బ్రేక్ పడినైట్టెంది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 158.95 పాయింట్లు లేదా 0.66 శాతం క్షీణించి 24,052.05 వద్ద ఆగింది. భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మళ్లీ 96 మార్కు దిగువకు చేరడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీసిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**అమ్మకాల ఒత్తిడిలో..**

సెన్సెక్స్ షేర్లలో హెచ్‌సీఎల్ టెక్ అత్యధికంగా 4.42 శాతం పతనమైంది. బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండిగో, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్అండ్‌టీ షేర్లూ క్షీణించాయి. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలతో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ రేటు 4.26 శాతం ఎగిసి 86.85 డాలర్లను తాకింది. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే.. ధరలు ఇంకా పెరుగడం ఖాయమన్న అభిప్రాయాలే వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హెర్ముజ్ జలసంధిలో రవాణా ఇబ్బందికరంగా మారడంతో భారత్‌పై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. దేశీయ ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా, మెజారిటీ వాటా యూఏఈ, సౌదీ, ఖతార్ తదితర గల్ఫ్ దేశాల నుంచే వస్తున్నది మరి. ఇప్పటికే దేశంలో రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. ముడి చమురు దిగుమతులు భారమైతే ధరలు మరింత ఎగబాకుతాయి. దీంతో రాబోయే ద్రవ్య సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపునకే మొగ్గు చూపుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే అంతిమంగా దేశ జీడీపీ ప్రభావితం కాగలదని, మదుపర్లలో ఈ భయాలే లాభాల స్వీకరణకు దారితీస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

**రంగాలవారీగా..**

బ్యాంకింగ్, రియల్టీ, ఆటో, ఆర్థిక సేవలు, ఐటీ రంగాల షేర్లు నష్టాలకు గురయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.01 శాతం, స్మాల్‌క్యాప్ 0.55 శాతం చొప్పున పడిపోయాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగియగా, యూరోపియన్ ప్రధాన సూచీలు నష్టాల్లో కదలాడుతున్నాయి. సోమవారం విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) రూ.3,062.27 కోట్ల పెట్టుబడులను దేశీయ మార్కెట్ల నుంచి వెనుకకు తీసుకున్నారు.

### రూ.6.51 లక్షల కోట్ల పన్ను వసూళ్లు




**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏడాదిప్రాతిపదికన 16.40 శాతం ఎగబాకి రూ.6.51 లక్షల కోట్లు వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. కార్పొరేట్ ట్యాక్స్ అధికంగా వసూలవడం వల్లనే పన్ను వసూళ్లలో రెండంకెల వృద్ధి నమోదైందని పేర్కొంది. ఈ నెల 13 నాటికి కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు 22 శాతం వృద్ధితో రూ.2.40 లక్షల కోట్లకు చేరుకోగా, కార్పొరేటేతర పన్ను వసూళ్లు కూడా 12 శాతం పెరిగి రూ.3.84 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ వసూళ్లు 48 శాతం అధికమై రూ.26,429 కోట్లకు చేరుకోగా, రూ.1.22 లక్షల కోట్లు రిఫండ్స్ రూపంలో చెల్లింపులు జరిపింది. స్థూలంగా ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.7.73 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

### ఐకియా 21 వేల కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ :** స్వీడన్‌కు చెందిన ఫర్నిచర్ రిటైలర్ ఐకియా దేశీయ మార్కెట్లో సత్తాచాటడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టిన సంస్థ..తాజాగా 2030 నాటికి రూ.21 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్టు కంపెనీ ఇండియా బిజినెస్ హెడ్ పాట్రిక్ ఆంటోని తెలిపారు. ఈ పెట్టుబడులతో మరో 15 స్టోర్లను ప్రారంభించబోతున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, ముంబై, నోయిడా, గురుగ్రామ్‌లలో పది అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది. అలాగే వచ్చే ఐదేండ్లలో టర్నోవర్ రూ.8 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

# ఎట్టకేలకు ఒక విజయం

**తొలి వన్డేలో భారత్ గెలుపు**
**6 వికెట్లతో ఇంగ్లండ్ చిత్తు**
**రాణించిన గిల్, అక్షర్, సుందర్**
**రేపు కార్డిఫ్‌లో రెండో వన్డే**



**బర్మింగ్‌హామ్:** ఫార్మాట్ మారింది... ఫలితం మారింది... ఐర్లాండ్--ఇంగ్లండ్ పర్యటనలో ఒక్క గెలుపు కోసం ఎదురు చూస్తున్న భారత అభిమానులకు ఎట్టకేలకు ఊరట దక్కింది. టి20ల్లో ఆరు పరాజయాల తర్వాత వన్డేల్లో సరైన ఆరంభం లభించింది. ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌటైంది. జో రూట్ (76 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), లియామ్ డాసన్ (83 బంతుల్లో 68; 6 ఫోర్లు 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు.
ఇంగ్లండ్ 107/6తో ఇబ్బందుల్లో ఉన్న దశలో రూట్, డాసన్ కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 22.2 ఓవర్లలో 121 పరుగులు జోడించారు. అనంతరం భారత్ 45.2 ఓవర్లలో 4 వికెట్లకు 262 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (75 బంతుల్లో 80 రిటైర్డ్‌హర్ట్; 11 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (52 బంతుల్లో 57 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (63 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. అక్షర్, సుందర్ ఐదో వికెట్‌కు 105 బంతుల్లో అభేద్యంగా 102 పరుగులు జత చేశారు. సిరీస్‌లో భారత్ 1--0తో పైచేయి సాధించగా... కార్డిఫ్‌లో రేపు రెండో వన్డే జరుగుతుంది.

**కీలక భాగస్వామ్యం...**

భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంలో ఆరంభంలో స్కోరు చేయడానికి ఇంగ్లండ్ బాగా ఇబ్బంది పడింది. 13వ బంతికి గానీ బెతెల్ (14) తొలి పరుగు తీయలేకపోగా, 7 ఓవర్లలో జట్టు 20 పరుగులే చేసింది. బుమ్రా తన తొలి స్పెల్‌ను 4--0--8--0తో ముగించాడు. ఈ దశలో గుర్నూర్ తొలి ఓవర్లో 2 సిక్సులు, ఫోర్ బాది దూకుడు ప్రదర్శించిన బెన్ డకెట్ (45 బంతుల్లో 43; 6 ఫోర్లు, 2 సిక్సులు) అతని రెండో ఓవర్లో మరో 2 ఫోర్లు కొట్టాడు. అయితే గుర్నూర్ తన తర్వాతి ఓవర్లో ప్రతీకారం తీర్చుకున్నాడు. ఒకే ఓవర్లో అతను బెతెల్, డకెట్‌లను వెనక్కి పంపించాడు. బుమ్రా చక్కటి బంతితో బ్రూక్ (1) పని పట్టగా... ఒకే ఓవర్లో బట్లర్ (5), స్యామ్ కరన్ (0)లను ప్రసిధ్ అవుట్ చేశాడు. 27 బంతుల వ్యవధిలో 19 పరుగులు మాత్రమే చేసి ఇంగ్లండ్ 5 వికెట్లు చేజార్చుకుంది. ఆపై విల్ జాక్స్ (20) కొద్దిసేపు వికెట్ల పతనాన్ని నిలువరించాడు. అతనూ పెవిలియన్ చేరిన తర్వాత రూట్, డాసన్ భాగస్వామ్యంతో జట్టు కోలుకుంది.
7 పరుగుల వద్ద రూట్ ఇచ్చిన సులువైన రిటర్న్ క్యాచ్‌ను దూబే వదిలేయడం ఇంగ్లండ్‌కు కాస్త కలిసొచ్చింది! ఈ క్రమంలో డాసన్ 65 బంతుల్లో వన్డేల్లో తన తొలి అర్ధసెంచరీ సాధించగా, రూట్ 57 బంతుల్లో కెరీర్‌లో 46వ హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. శతక భాగస్వామ్యం తర్వాత డాసన్‌ను అవుట్ చేసి అక్షర్ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత మరో 30 పరుగులకు ఇంగ్లండ్ చివరి 3 వికెట్లు కోల్పోగా, రూట్ అజేయంగా నిలిచాడు.

**రోహిత్, కోహ్లి విఫలం...**

ఛేదనలో భారత్‌కు సరైన ఆరంభం లభించలేదు. తడబడుతూనే ఆడిన రోహిత్ శర్మ (21 బంతుల్లో 11; 1 ఫోర్) భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరగ్గా, ఆర్చర్ చక్కటి బంతితో కోహ్లి (5)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. కెపట?టన్ గిల్‌కు మరో ఎండ్ నుంచి శ్రేయస్ అయ్యర్ (35; 2 ఫోర్లు) సహకరించాడు. వీరిద్దరు 101 పరుగులు జత చేశారు. ఈ దశలో తొడ కండరాలు పట్టేయడంతో గిల్ మైదానం వీడగా... మూడు పరుగుల వ్యవధిలో అయ్యర్, రాహుల్ (1) వెనుదిరిగాడు. ఈ దశలో భారత్‌పై కొంత ఒత్తిడి కనిపించింది. అయితే సుందర్, అక్షర్ చక్కటి ప్రదర్శనతో జట్టును గెలుపు దిశగా నడిపించారు. 39 బంతుల్లోనే అక్షర్ నాలుగో అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత కూడా ఈ ఇద్దరు ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా గెలుపు ఖాయం చేశారు. రషీద్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో సుందర్ 63 బంతుల్లో తన రెండో హాఫ్ సెంచరీని చేరుకోవడంతో పాటు మ్యాచ్‌ను ముగించాడు.

**స్కోరు వివరాలు**

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: డకెట్ (సి) బుమ్రా (బి) బ్రార్ 43; బెతెల్ (సి) సుందర్ (బి) బ్రార్ 14; రూట్ (నాటౌట్) 76; బ్రూక్ (సి) రోహిత్ (బి) బుమ్రా 1; బట్లర్ (సి) బ్రార్ (బి) ప్రసిధ్ 5; కరన్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్ 0; జాక్స్ (సి) రాహుల్ (బి) దూబే 20; డాసన్ (సి) రోహిత్ (బి) అక్షర్ 68; ఆర్చర్ (సి) సుందర్ (బి) అక్షర్ 12; రషీద్ (స్టంప్డ్) రాహుల్ (బి) అక్షర్ 1; టంగ్ (బి) అక్షర్ 0; ఎక్స్‌ట్రాలు 18; మొత్తం (47.5 ఓవర్లలో ఆలౌట్) 258. వికెట్ల పతనం: 1--61, 2--63, 3--64, 4--80, 5--80, 6--107, 7--228, 8--250, 9--258, 10--258. బౌలింగ్: బుమ్రా 9--0--31--1, ప్రసిధ్ 10--2--50--2, గుర్నూర్ బ్రార్ 9--0--61--2, శివమ్ దూబే 6--0--27--1, సుందర్ 4--0--13--0, అక్షర్ పటేల్ 9.5--0--62--4. భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) బ్రూక్ (బి) కరన్ 11; గిల్ (రిటైర్డ్‌హర్ట్) 80; కోహ్లి (ఎల్బీ) (బి) ఆర్చర్ 5; అయ్యర్ (రనౌట్) 35; సుందర్ (నాటౌట్) 52; రాహుల్ (బి) టంగ్ 1; అక్షర్ (నాటౌట్) 57; ఎక్స్‌ట్రాలు 21; మొత్తం (45.2 ఓవర్లలో 4 వికెట్లకు) 262. వికెట్ల పతనం: 1--43, 2--48, 3--157, 4--160.బౌలింగ్: ఆర్చర్ 10--0--60--1, టంగ్ 10--0--50--1, స్యామ్ కరన్ 10--0--55--1, రషీద్ 5.2--0--34--0, బెతెల్ 1--0--10--0, డాసన్ 2--0--10--0, జాక్స్ 7--0--43--0.

## స్పోర్ట్స్


# అర్జెంటీనాకు ఇంగ్లండ్ సవాల్..

## నేడు ఇంగ్లిష్ టీమ్‌తో మెస్సీసేన సెమీస్ పోరు

**అర్ధరాత్రి 12.30 నుంచి యునైట్8 స్పోర్ట్స్, జీ5లో లైవ్**



**అట్లాంటా :** ఫిఫా ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలవాలని ఆశిస్తున్న లియోనల్ మెస్సీ కెప్టెన్సీలోని అర్జెంటీనా అతి పెద్ద సవాల్‌ను ఎదుర్కోనుంది. బుధవారం అర్ధ రాత్రి జరిగే రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా..బలమైన ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సాకర్ సామ్రాజ్యంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ రెండు జట్లు వరల్డ్‌కప్‌లో 21 ఏండ్ల తర్వాత మళ్లీ ముఖాముఖి తలపడుతుండటంతో ఈ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ టోర్నీలో ఇంగ్లండ్ ఇప్పటివరకు ఓటమి ఎరుగకుండా దూసుకుపోతోంది. నాకౌట్ దశలో కాంగో, సహ ఆతిథ్య జట్టు మెక్సికో, నార్వేపై విజయాలు సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది.
ఆ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్ ఆరు గోల్స్ సాధించగా, మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ కూడా ఆరు గోల్స్, ఒక అసిస్ట్‌తో సూపర్ ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు, డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా ప్రతి మ్యాచ్‌లోనూ తీవ్రంగా శ్రమించి సెమీస్‌కు వచ్చింది. గ్రూప్-జె లో అగ్రస్థానంలో నిలిచిన ఆ జట్టు.. నాకౌట్ రౌండ్లలో కాబో వెర్డె, ఈజిప్ట్‌ను ఓడించేందుకు చెమటోడ్చింది. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై ఎక్స్‌ట్రా టైమ్‌లో 3-1తో విజయం సాధించింది. అర్జెంటీనాను కెప్టెన్ లియోనల్ మెస్సీ ముందుండి నడిపిస్తున్నాడు. ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన మెస్సీ.. ఈ టోర్నీలో ఇప్పటివరకు 8 గోల్స్, రెండు అసిస్ట్‌లు సాధించాడు. ఇక, ముఖాముఖిలో అర్జెంటీనాపై ఇంగ్లండ్‌దే పైచేయి కావడం మెస్సీ అభిమానులను కాస్త ఆందోళనపరిచే విషయం. ఇరు జట్ల మధ్య ఇప్పటివరకు 14 మ్యాచ్‌లు జరగ్గా.. ఇంగ్లండ్ ఆరుసార్లు నెగ్గితే.. అర్జెంటీనా 3 మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది.మరి, ఈసారి ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.



# మధ్యతరగతి మందహాసాలు

శ్రీకాంత్, లయ నాయకానాయికలుగా రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మిస్టర్ మిడిల్‌క్లాస్'. జి.నాగేశ్వర రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం ట్రైలర్‌ను ఆవిష్కరించడంతో పాటు ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు వి.వి.వినాయక్, దశరథ్, రచయిత కోన వెంకట్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ .. మధ్యతరగతి కష్టాలను వినోదాత్మకంగా ఈ సినిమాలో చూపించారన్నారు. ఇందులో నటించిన ప్రతీ ఆర్టిస్టుతో గతంలో తాను సినిమాలు చేశానని, మళ్లీ వారందరితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం పాత రోజులను గుర్తుకు తెచ్చిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమాలో తాను వెంకటేశ్వరస్వామి పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నానని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ సినిమాతో శ్రీకాంత్ బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టబోతున్నారని, రాజేంద్రప్రసాద్ పాత్ర వెన్నెముకలా నిలిచిందని, ఆద్యంతం హాస్యభరితంగా సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుందని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు

# చెన్నైకి మకాం మార్పు

కమల్‌హాసన్ ముద్దుల తనయ శృతిహాసన్ చెన్నైలో కొత్త ఇంటిలోకి అడుగుపెట్టింది. గృహ ప్రవేశానికి సంబంధించిన ఫొటోలను తన సోషల్‌మీడియా ఖాతాల ద్వారా పంచుకుంది. దాదాపు 40కోట్ల వ్యయంతో తన అభిరుచికి తగినట్లు శృతిహాసన్ ఇంటిని డిజైన్ చేసుకుందట. సోమవారం జరిగిన గృహ ప్రవేశ వేడుకలో ఆమె సోదరి అక్షరహాసన్‌తో పాటు కొద్దిమంది స్నేహితులు పాల్గొన్నారు. కెరీర్ ఆరంభం నుంచి దాదాపు పదిహేనేళ్లుగా ముంబయిలో నివాసం ఉంటున్నది శృతిహాసన్. అయితే గతకొంతకాలంగా బాలీవుడ్‌లో ఈ భామకు అవకాశాలు తగ్గాయి. వ్యక్తిగత జీవితంలో కూడా ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశ్యంలో తిరిగి చెన్నైకి మకాం మార్చిందని అంటున్నారు. ఇక నుంచి దక్షిణాది సినిమాలకే ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయం కూడా ఈ భామ చెన్నైకి షిఫ్ట్ కావడానికి ఓ కారణమని చెబుతున్నారు. ఇటీవలే 'పెద్ది' సినిమాలో ఐటెం సాంగ్‌లో మెరిసిన ఈ సొగసరి ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో నటిస్తున్నది.





# అతిథి పాత్రకు 15కోట్లు?

పారితోషికాల విషయంలో హీరోలతో పోటీపడుతూ తగ్గేదేలే అంటున్నారు అగ్ర కథానాయికలు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్స్ రెమ్యునరేషన్ కూడా రెండుమూడు కోట్లకు మించేది కాదు. కానీ ఇప్పుడు సినీ వ్యాపార సమీకరణాలు మారిపోయాయి. పాన్ ఇండియా ట్రెండ్‌తో పాటు నాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు ఆదరణ పెరగడంతో హీరోయిన్స్ సైతం భారీ పారితోషికాలను డిమాండ్ చేస్తున్నారు. దక్షిణాదితో పాటు హిందీలో అగ్ర కథానాయికలు పదికోట్లకు పైగా రెమ్యునరేషన్ అందుకోవడం సాధారణంగా మారింది. అయితే బాలీవుడ్ భామ అలియాభట్ అతిథి పాత్రకోసమే 15కోట్ల రెమ్యునరేషన్ స్వీకరించి ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. హిందీ సూపర్‌హిట్ హారర్ ఫిల్మ్ 'తుంబాడ్'కు సీక్వెల్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. సోహమ్‌షా హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి అనిల్ బార్వే దర్శకుడు. ఇందులో అలియా కీలకమైన అతిథి పాత్రను పోషిస్తున్నది. కేవలం పదినిమిషాల నిడివిగల ఈ పాత్ర కోసం మేకర్స్ అలియాభట్‌కు 15 కోట్ల రెమ్యునరేషన్‌ను ఆఫర్ చేశారని తెలిసింది. పాన్ ఇండియా స్థాయిలో అలియాభట్‌కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకొని ఆమె కోరినంత పారితోషికాన్ని ఇచ్చారని బాలీవుడ్ ట్రేడ్‌వర్గాల్లో వినిపిస్తున్నది. త్వరలో ఈ సినిమా సెట్స్‌లో అలియాభట్ జాయిన్ కానుంది. ఈ సీక్వెల్‌లో నవాజుద్దీన్ సిద్ధికీ సైతం ఓ హీరోగా నటిస్తున్నారు. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది.



# పోలీస్ పాత్రలో కొత్త సినిమా?

'కేజీఎఫ్' ఫ్రాంఛైజీతో దేశవ్యాప్తంగా మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు కన్నడ అగ్ర హీరో యశ్. ఆయన తాజా చిత్రం 'టాక్సిక్' ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. దీనితో పాటు బాలీవుడ్ 'రామాయణ'లో కూడా యశ్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత యశ్ చేయబోయే ప్రాజెక్ట్ ఏంటన్నది ఆసక్తికరంగా మారింది. తాజా సమాచారం ప్రకారం 'సప్త సాగరదాచే ఎల్లో' (తెలుగులో 'సప్తసాగరాలు దాటి') చిత్రంతో కన్నడంలో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు దర్శకుడు హేమంత్ ఎమ్ రావ్. ఆయన దర్శకత్వంలో యశ్ తన తదుపరి సినిమా చేయబోతున్నారని కన్నడ ఫిల్మ్‌వర్గాల్లో వినిపిస్తున్నది. ఇందులో యశ్ పోలీస్ పాత్రలో కనిపించబోతున్నారని, సామాజిక అంశాల చుట్టూ అల్లుకున్న ఈ కథలో ఆయన ఫెరోషియస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో కరణ్‌జోహార్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని తెలిసింది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967